5 ఆంధ్రజ్యోతి

నవ్య

కుటుంబ కదంబం

శనివారం • 20 ఏప్రిల్ 2024



చికెన్‌తో చేసే వంటలు ఏవైనా మినిమమ్ గ్యారెంటీ. ఎప్పుడూ వండే కూరలు కాకుండా కాస్త వెరైటీగా ఆఫ్ఘనీ చికెన్ కర్రీ, అపోలో చికెన్, చికెన్ లెగ్స్ ఫ్రై, చికెన్ పాప్‌కార్న్‌ను సులువుగా చేసుకోవచ్చు. ఈ వీకెండ్ మీరూ ఎంచక్కా చేసుకోండిలా..

కోడి మాంసం.. కాస్త వెరైటీగా!

చికెన్ లెగ్స్ ఫ్రై

కావాల్సిన పదార్థాలు: చికెన్ లెగ్ పీస్‌లు- 6, పెరుగు- 6 టేబుల్ స్పూన్లు, ఉప్పు- రుచికి తగినంత, కారం పొడి- రెండున్నర టీ స్పూన్లు, జింజర్ గార్లిక్ పేస్ట్- 2 టీస్పూన్లు, పసుపు- చిటికెడు, ధనియాల పొడి- టీస్పూన్, గరం మసాలా- టీస్పూన్, పెప్పర్ పౌడర్- అర టీస్పూన్, చాట్ మసాలా- అరటీస్పూన్, టమోటా కెచప్- 4 టేబుల్ స్పూన్లు, నిమ్మకాయ-1, పచ్చిమిర్చి- 3 (సన్నగా తరగాలి), తరిగిన కొత్తిమీర- రెండు టేబుల్ స్పూన్లు, కరివేపాకులు- 10, నూనె- 3 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం: చికెన్ లెగ్ పీస్‌లను మంచి నీటితో శుభ్రంగా కడగాలి. లెగ్ పీస్‌ల మీద కత్తితో మూడు గాట్లు పెట్టాలి. ఈ పీస్‌లను ఒక బాక్స్‌లో ఉంచాలి.

మరో బౌల్‌లో పెరుగు, ఉప్పు, ధనియాల పొడి, కారం పొడి, జింజర్ గార్లిక్ పేస్ట్, పసుపు, గరం మసాలా, పెప్పర్ పొడి, చాట్ మసాలా, టమోటా కెచప్ వేశాక నిమ్మకాయ రసాన్ని పిండాలి. ఆ తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర, కరివేపాకు వేసి స్పూన్‌తో రెండు నిముషాలు మిక్స్ చేశాక ఎగ్ మిక్సర్‌తో మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని లెగ్ పీస్‌ల మీద వేయాలి. మిశ్రమాన్ని బాగా కలిపితే ముక్కలకు పడుతుంది. బాక్స్‌ను క్లోజ్ చేసి రెండున్నర గంటల పాటు మారినేట్ చేసుకోవాలి.

ప్యాన్‌లో నూనె వేసి మారినేట్ చేసుకున్న లెగ్ పీస్‌లను వేసుకోవాలి. బాక్సులో మిగిలిన మిశ్రమాన్నంతా అందులోనే వేయాలి. ఆ తర్వాత మంటను మీడియమ్ ఫ్లేమ్‌లో ఉంచి కుక్ చేసుకోవాలి. ప్యాన్‌కు అంటుకోకుండా.. ముక్క మాడిపోకుండా గరిటెతో కదుపుతూనే ఉండాలి. ఉడికిన తర్వాత చివరగా సిమ్‌లో ఉంచి వేయించాలి. ముక్కలు రెండు వైపులా బాగా కాల్చుకున్న తర్వాత స్టవ్ కట్టేసి వడ్డించుకోవటమే. ఈ లెగ్‌పీస్‌లు జ్యూసీగా ఉంటాయి. అవసరం అనుకుంటే టమోటా కెచప్ లేదా కొత్తిమీర చట్నీతో తినాలి.



అపోలో చికెన్ ఫ్రై

కావాల్సిన పదార్థాలు: చికెన్ బ్రెస్ట్- 400 గ్రాములు, నూనె- రెండు టేబుల్ స్పూన్లు, జీలకర్ర పొడి- ముప్పావు టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత, అల్లం, వెల్లుల్లి పేస్ట్- అర టీస్పూన్, వెల్లుల్లి రెబ్బలు- 4 (సన్నగా తరగాలి), కరివేపాకు- 10 ఆకులు, పచ్చిమిర్చి- 4 (సన్నగా నిలువుగా కోయాలి), కారం- అర టీస్పూన్, చిన్న ఉల్లిపాయ- 1 (సన్నగా తరగాలి), పసుపు- చిటికెడు, కోడిగుడ్డు- 1, మైదా- రెండున్నర టేబుల్ స్పూన్లు, కార్న్‌ఫ్లోర్- రెండున్నర టేబుల్ స్పూన్లు, నూనె- డీప్ ఫ్రైకి తగినంత, పండు మిరపకాయల పేస్ట్- కొద్దిగా, పసుపు- చిటికెడు, పెరుగు- 300 గ్రాములు, ధనియాల పొడి- అర టీస్పూన్, గరం మసాలా- అర టీస్పూన్,

తయారీ విధానం: చికెన్ శుభ్రంగా కడిగి.. చిటికెన వేలంత పొడవుగా, సన్నగా కట్ చేసుకోవాలి. దీన్ని బౌల్‌లో వేసుకోవాలి. ఇందులోకి అర టీస్పూన్ జీలకర్ర, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్,



కారం, పసుపు, కోడిగుడ్డు సొన, మైదాపిండి, కార్న్‌ఫ్లోర్ వేసి బాగా కలపాలి. ఈ చికెన్ ముక్కలను రెండు నిముషాల పాటు ఉంచి.. ఆ తర్వాత నూనె వేడి చేసి మీడియం ఫ్లేమ్‌లో ఈ చికెన్ ముక్కలను పకోడీల్లా డీప్ ఫ్రై చేసుకోవాలి. మరో బౌల్‌లో నూనె వేసి వెల్లుల్లి రెబ్బలు వేసి గరిటెతో కదిపాక కరివేపాకు, పచ్చిమిర్చి ముక్కలు, తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి రంగు మారేంత వరకూ వేయించాక అందులోకి కొద్దిగా అల్లం పేస్ట్ వేసి గరిటెతో కలపాలి. ఇందులోకి పండు మిరపకాయల పేస్ట్, పసుపు వేసి బాగా కలపాలి. ఇందులోకి పెరుగు వేసి మిక్స్ చేయాలి. ఇందులోకి తగినంత ఉప్పు వేశాక మిగిలిన జీలకర్ర పొడి, ధనియాల పొడి, గరం మసాలా వేసి నిముషం పాటు గరిటెతో కదిపాక.. ఇందులోకి వేయించిన చికెన్ ముక్కలను వేసి కలపాలి. గరిటెతో మూడు నిముషాల పాటు కదిపితే చికెన్ ముక్కలకు మసాలా బాగా పడుతుంది. చివరగా కొత్తిమీర వేసి నిముషం పాటు కదిపి ప్లేట్‌లో వేసి వడ్డించుకోవటమే తరువాయి.

చికెన్ పాప్‌కార్న్

కావాల్సిన పదార్థాలు: చికెన్ బ్రెస్ట్- పావు కేజీ (చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి), ఉప్పు- రుచికి తగినంత, కారం- 1 టీస్పూన్, వెల్లుల్లి పొడి- 1 టీస్పూన్, వెనిగర్- టేబుల్ స్పూన్, సోయాసాస్- అర టీస్పూన్, రెడ్ చిల్లీ సాస్- 2 టేబుల్ స్పూన్లు, పాలు- పావు కప్పు, కోడిగుడ్డు- 1, మైదా- 1 కప్పు, కార్న్ ఫ్లోర్- 1 కప్పు, కారం - టీస్పూన్, అల్లం పొడి- 1 టీస్పూన్, నూనె- డీప్ ఫ్రైకి తగినంత

తయారీ విధానం: బౌల్‌లో చికెన్ ముక్కలు వేసి అందులో తగినంత ఉప్పు, కారం, వెల్లుల్లి పొడి, వెనిగర్, సోయాసాస్, రెడ్ చిల్లీ సాస్, పాలు వేసి స్పూన్‌తో బాగా మిక్స్ చేయాలి. దీన్ని పాలిథీన్ కవర్‌తో కవర్ చేసి ఫ్రిజ్‌లో ఉంచి అర గంట పాటు మారినేట్ చేసుకోవాలి.

ఫ్రిజ్‌నుంచి తీశాక కోడిగుడ్డు సొన వేసి కలపాలి. మరో బౌల్‌లో మైదా, కార్న్‌ఫ్లోర్, కారంతో పాటు రుచికి తగినంత ఉప్పు, అల్లం పొడి వేసి ఎగ్ మిక్సర్‌తో మిశ్రమాన్ని బాగా కలపాలి. చిన్న బౌల్‌లో చల్లనీళ్లు తీసుకోవాలి. ఆ తర్వాత బౌల్‌లోని చికెన్ ముక్కలను స్పూన్‌తో ఒక్కోటి తీసుకుని మిక్స్ చేసి మైదా పిండిలో వేయాలి. పిండి బాగా పట్టేట్లు కదిపి.. ప్రతి ముక్కను చల్లనీళ్లలో వేసి మళ్లీ పిండిలో వేయాలి. ఇలా చేస్తే మైదా, కార్న్‌ఫ్లోర్‌ల మిశ్రమం ముక్కకు బాగా పడుతుంది. పిండి అద్దిన ఈ చికెన్ ముక్కలను ఒక బౌల్‌లో వేసుకుని ఒకేసారి డీప్ ఫ్రై చేసుకోవాలి. ఈ పాప్‌కార్న్ మంచి టెక్చర్‌తో పాటు రుచికరంగా ఉంటాయి. టమోటా కెచప్‌తో తినొచ్చు.

ఆఫ్ఘనీ చికెన్ కర్రీ

కావాల్సిన పదార్థాలు

చికెన్- కేజీ, పచ్చి మిరపకాయలు- 8 (సన్నగా తరగాలి), మీడియం సైజ్ ఉల్లిపాయలు- 2 (సన్నగా తరగాలి), వెల్లుల్లి రెబ్బలు- 9 (సన్నగా తరగాలి), అల్లం- చిన్న ముక్క, పెరుగు- కప్పు, కొత్తిమీర- కట్ట (సన్నగా తరగాలి), ఫ్రెష్ క్రీమ్- కప్పు, గరం మసాలా- ముప్పావు టేబుల్ స్పూన్, ఉప్పు- రుచికి తగినంత, కసూరీ మేథీ- టేబుల్ స్పూన్, చాట్ మసాలా- రెండు టీస్పూన్లు, యాలకులు-3, లవంగాలు-3, నూనె- 3 టేబుల్ స్పూన్లు, చిన్న నిమ్మకాయ- 1, దాల్చిన చెక్క- 1, మిరియాల పొడి - టేబుల్ స్పూన్.

తయారీ విధానం

జార్‌లో ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, వెల్లుల్లి, అల్లం, కొత్తిమీర వేసి మిక్సీ పట్టాలి. ఈ మెత్తని పేస్ట్‌ను బౌల్‌లో వేసుకోవాలి. ఇందులోకి పెరుగు, ఫ్రెష్ క్రీమ్, గరం మసాలా, ఉప్పు, చాట్ మసాలా, మిరియాల పొడి, కసూరీ మేథీ వేసి అందులో సగం నిమ్మకాయ రసం పిండాలి. గరిటెతో రెండు నిముషాలు కలిపిన తర్వాత ఎగ్ మిక్సర్‌తో వేగంగా మిక్స్ చేయాలి. దీనివల్ల అన్ని ఫ్లేవర్స్ బాగా కలసిపోతాయి. ఈ మిశ్రమాన్ని పక్కన ఉంచుకోవాలి.

చికెన్‌ను మంచి నీళ్లతో శుభ్రంగా కడిగి.. ప్రతీ ముక్క మీద కత్తితో రెండు లేదా మూడు గాట్లు పెట్టాలి. ఆ చికెన్‌ను బౌల్‌లో వేసుకోవాలి. ఇందులోకి మిక్సీ పట్టిన పేస్ట్ కొంచెం వేసి చికెన్ ముక్కలకు అంటేట్లు బాగా చేత్తో కలపాలి. మారినేట్ చేసి గంటన్నరపాటు వదిలేయాలి. మిగిలిన పేస్ట్‌ను కూడా గంటన్నరపాటు పక్కన ఉంచుకోవాలి. ఆ తర్వాత ప్యాన్‌లో నూనె వేయాలి. నూనె వేడయ్యాక మారినేట్ చేసి పెట్టుకున్న చికెన్ ముక్కలను ఉంచాలి. రెండు వైపులా ఉడికేట్లు గరిటెతో తిప్పుతూ కుక్ చేసుకోవాలి. కనీసం పదిహేను నిముషాల పాటు ప్యాన్‌లో ముక్కలను వేయించి ప్లేట్‌లో ఉంచుకోవాలి. వెంటనే ప్యాన్‌లో మిగిలిన నూనెలో యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క వేసి కలపాలి. ఆ తర్వాత మిక్సీ పట్టిన మిగిలిన పేస్ట్‌ను వేసి బాగా కలిపి.. ప్యాన్ మూత పెట్టి పది నిముషాల పాటు ఉడికించాలి. ఆ తర్వాత వేయించిన చికెన్ ముక్కలు వేసి మిశ్రమంలో రెండు నిముషాల పాటు కలిపిన తర్వాత ప్యాన్ మూత ఉంచి పదిహేను నిముషాల పాటు చిన్న మంట మీద కుక్ చేయాలి. చికెన్ ముక్కలు మగ్గుతాయి. నూనె పైకి తేలి ఉడికినట్లు కనపడితే రెండు నిముషాలు గరిటెతో మిక్స్ చేసి దించేసుకోవటమే. ఈ ఆఫ్ఘనీ చికెన్ కర్రీలో నిమ్మకాయ పిండుకుని రోటీ, చపాతీ, దోశల్లోకి తింటే భలే ఉంటుంది.





శంఖానుకారీ తచ్ఛుభ్రంచంద్రవత్సరం దధి

దృష్టంతన్మకరాధారైః స్ఫోటితం పరివేషితమ్!

పెరుగంటే తెల్లని శంఖంలా ఉండాలి. దట్టంగా మీగడ కట్టి, చంద్రబింబంలా కనిపించాలి. చెంచాలాంటి పరికరంతో ముక్కలుగా కోయగలిగేంత గట్టిగా ఉండాలంటున్నాడు క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలోని ఈ పద్యంలో. అలాంటి పాలనిచ్చే ఆవునో, గేదెనో మేపటం, ప్రత్యేకమైన పొయ్యి మీదో పాలు కాయడం దగ్గరినుంచి... తోడు పెట్టేవరకూ అన్ని జాగ్రత్తలూ తీసుకుంటే ఒకటి రెండు చెంచాలు కలిపి, కొద్దిగా జీలకర్ర పొడి వేసుకుని తాగితే జీర్ణ శక్తి పదిలం అవుతుంది. కడుపులో చల్లగా ఉంటుంది. ఎసిడిటీ తగ్గుతుంది. అమీబియాసిస్ లాంటి వ్యాధులకు ఇదే మందు. అల్సర్లు త్వరగా తగ్గుతాయి.

- బాగా చిక్కపడేలా కాచిన పాలకు రెండు అదనపు ప్రయోజనాలు కలుగుతాయి. మొదటిది అంతటి అత్యధిక ఉష్ణోగ్రత దగ్గర కాయటం వలన పాలలో ఉండే చెడ్డ బాక్టీరియా పూర్తిగా నశిస్తుంది. కొద్దిగా పొంగు వస్తే చాలు కాయటం ఆపేసిన పాలలో చెడ్డ బాక్టీరియా పూర్తిగా చావదు. ఒక వంతు పాలు మరిగే

పెరుగు ఎలా ఉండాలంటే

పెరుగు ఇలా జున్ను ముక్కలా కోయగలిగేలా తోడుకుంటుంది కూడా!

ఇలా తోడుకున్న పెరుగుకు ఆయుర్వేద శాస్త్రంలో చెప్పిన గుణాలన్నీ ఉన్నాయి. ఒక్కో జంతువు పాలతో తోడుపెట్టిన పెరుగుకు ఒక్కో లక్షణాలు చెప్పింది శాస్త్రం. మనకు పాలు ప్యాకెట్లలో పట్టి, పాల కంపెనీలు పంపిస్తున్నాయి. వారు ఏది ప్యాకెట్లో ఇస్తే అదే మనకు శరణ్యం అవుతోంది. లేకపోతే బిందెల్లో ఇంటికి తెచ్చి పోసే పాల మీద ఆధారపడాల్సి వస్తోంది. ప్రభుత్వాలకు పాల మీద అదుపు లేదు. పాలు కుళ్లు వాసన వస్తుంటే ఇవ్వాళేదో రుచిలో తేడాగా ఉన్నదనుకుంటూనే సరిపెట్టుకుని వాడేసుకుంటున్నాం.

ఇన్ని ప్రతికూలతల మధ్య కూడా సామాన్యుడు పాలను... పెరుగునూ కొనుక్కుని వాడుకుంటున్నాడు. ఈ పరిస్థితుల్లో పాలు కొనుక్కొని తోడు పెట్టుకోవటమే ఉన్నంతలో నయం. పాలను రెండు మూడు పొంగు లొచ్చేదాకా మరగనిస్తే చిక్కదనం వస్తుంది. వాటిని తోడేసిన పెరుగు గట్టిగా ఉంటుంది. పలుచని పెరుగులో కన్నా గట్టి పెరుగులో ఉపయోగపడే బాక్టీరియా బలంగా ఎదుగుతుంది.



> 'శాల్యోదనేన సంయుక్తం సతతం మాహిషం దధి' అంటూ గేదె పెరుగు కలిపిన అన్నం కృష్ణుడికి ఇష్టం అని గోపికలు తెచ్చి ప్రేమతో తినిపించేవారట. చద్దన్నం అంటే ఈ చల్లన్నమే! పాచిపోయిన అన్నం కాదు! పెరుగన్నం వాతాన్ని, వేడినీ తగ్గిస్తుంది. బలాన్ని శక్తినీ ఇస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. ఇందులో దానిమ్మ గింజలు, ద్రాక్ష పండ్లు వగైరా కలిపి, కొత్తిమీరతో అలంకరించి తాలింపు పెట్టిన దద్ధోజనం తిరుగులేని శక్తిదాయిని.

గట్టిగా తోడుకున్న పెరుగుని తీసుకుని దాంతో మనం చేసుకోగల పదార్థాల గురించి క్షేమశర్మ వివరించాడు. మండే ఈ ఎండాకాలంలో శరీరానికి చల్లదనాన్నిచ్చే పెరుగు మజ్జిగల గురించే కదా మనం ఆలోచించాల్సింది!

- ఒక గ్లాసు పెరుగులో 3 గ్లాసుల నీళ్లు కలిపి చిలికి, ఒక రాత్రంతా ఉంచి, మర్నాడు అందులో సైంధవ లవణం, అల్లం కలిపి నూరాలి. ఈ ముద్దను

దాకా కాచిన పాలే ఆరోగ్యదాయకమైనవి. ఈ పాలతో తోడుపెట్టిన పెరుగు మరింత ఆరోగ్యదాయకమైంది. బలమైన, ఉపయోగపడే బాక్టీరియాని కలిగి ఉండి పేగుల్ని సంరక్షిస్తుంది. చిక్కటి పాలతో చేసిన పెరుగు వాతాన్ని, పైత్యాన్ని తగ్గిస్తుందని క్షేమశర్మ చెప్పాడు. ధాతువుల్లో ఉండే అగ్నిని పెంపు చేస్తుంది. ధాత్వగ్ని పాకం జరిగిన రస రక్త మాంసాది ధాతువులు శరీరానికి బాగా అందుతాయి. శక్తి ఉత్పత్తి బాగా జరుగుతుంది. ఎనీమియా లాంటి ధాతుక్షీణ వ్యాధులు రాకుండా ఉంటాయి.

- గేదె పాలకన్నా ఆవు పాలు కొద్దిగా పలచగా ఉంటాయి. అందుకని ఆవు పాలను మరింతసేపు కాయాల్సి ఉంటుంది. చిక్కని ఆవుపాలతో చేసిన పెరుగు అన్ని దోషాలనూ హరిస్తుంది. పూర్తిగా జీర్ణం అయ్యాక తీపి పదార్థం ఏ గుణాలిస్తుందో పెరుగు కూడా అవే గుణాలిస్తుంది. ఒక కప్పు పెరుగు 200 గ్రాముల స్వీటుతో సమానమే. కానీ పెరుగు గుండెకు మంచిది. జీర్ణ శక్తిని పెంచుతుంది. కొద్దిగా వేడి చేస్తుంది.
- గేదె పాలతో చేసిన పెరుగు పైత్యాన్ని, కఫాన్ని తగ్గిస్తుంది. కానీ, కష్టంగా అరుగుతుంది. నాలుగైదు పొంగులు వచ్చేదాకా మరిగిస్తే తేలిగ్గా అరుగుతాయి. చలవనిస్తుంది. కాగీ కాగని పాలతో చేసిన పెరుగు వాతాన్ని, అజీర్తిని పెంచుతుంది. స్థూలకాయాన్ని తెస్తుంది. స్త్రీ, పురుష పరమైన శక్తి, ఆసక్తి పెరుగుతాయి.
- మేక పాలను కూడా ఇలానే కాచుకుని తోడు పెట్టుకుంటే మూడు దోషాలూ హరిస్తాయి. క్షయవ్యాధికి గొప్ప ఔషధంగా పని చేస్తాయి. క్షీణింపచేసే వ్యాధుల్లో మేలు చేస్తాయి. దగ్గు, జలుబు, ఆయాసం, ఉబ్బసం రోగులకు మంచిది.
- ప్యాకెట్టు పాలు, పెరుగు కచ్చితంగా ఏ పాలతో తయారయ్యాయో తెలియదు. విదేశాల నుంచి దిగుమతి అయిన పాల పొడితో తయారైన పాలకు మన దేశపు ఆవు పాల గుణాలున్నాయో లేదో చెప్పలేము. ఏ పాలతో తయరైన పెరుగైనా రాత్రిపూట తినటం మంచిది కాదు. బాగా చిలికి అందులో అల్లం, జీలకర్ర, సైంధవలవణం కలిపి తాగటమే శ్రేయస్కరం. ఉప్పు నిషేధం ఉన్నవారు అది లేకుండానే జీలకర్ర వగైరా కలిపి తాగవచ్చు. పెరుగుకు నిషేధాలున్నాయి గానీ మజ్జిగకు శీతాకాలం, వర్షాకాలం ఇలా ఏ కాల నియమాలూ లేవు.

- గంగరాజు అరుణాదేవి

మేకప్

అలసిన కళ్లు మిలమిల

అలసటతో జీవం తగ్గిన కళ్లకు ఐ మేకప్‌తో జీవం పోయవచ్చు. కళ్ల కింద నలుపు, వాపు లాంటి లక్షణాలను కూడా ఐమేకప్‌తో దాచేయవచ్చు. అదెలాగంటే...

ఐ షాడో: తేలిక రంగు ఐ షాడోను కనురెప్పల పైన, కళ్ల అంచుల్లో ఉండే ముడతలు, కళ్ల చివర్లలో అద్దుకుంటే అలసట ప్రతిబింబించే కళ్లు మెరుపును సంతరించుకుంటాయి.

కన్‌సీలర్: కన్‌సీలర్ కళ్ల కింద నలుపును పూర్తిగా దాచలేదు. కాబట్టి కన్‌సీలర్ అద్దుకున్న తర్వాత, దాని పైన షిమ్మరీ హైలైటర్ అప్లై చేసుకోవాలి.

ఐబ్రో: అలసిన కళ్ల నుంచి చూపులను మరల్చడం కోసం కనుబొమలను ఆకర్షణీయంగా దిద్దుకోవాలి. ఐబ్రో పెన్సిల్ లేదా ఐ షాడోతో కనుబొమలను మృదువుగా అందంగా దిద్దుకోవాలి. కనుబొమలను దిద్దుకోడానికి నలుపు రంగుకు బదులుగా ముదురు గోధుమ రంగు ఎంచుకోవాలి. ఇలా చేయడం వల్ల న్యాచురల్ లుక్ సొంతమవుతుంది.




కనురెప్పలు: మస్కారా అప్లై చేయడాని కంటే ముందు కనురెప్పల వెంట్రుకలను కర్లర్‌తో పైకి తిప్పుకోవాలి. ఇలా తిప్పుకునే సమయంలో రెప్పల వెంట్రుకలన్నీ కర్లర్‌లోకి ఒదిగాయో లేదో గమనించుకోవాలి. వెంట్రుకల కుదుళ్ల నుంచి అంచుల వరకూ కర్లర్‌ను కదిలిస్తూ ల్యాషెస్‌ను వంపు తిప్పుకోవాలి.

స్ఫూర్తి

వైకల్యాన్ని జయించి... సివిల్ సర్వీసెస్ నెగ్గి

సెరెబ్రల్ పాల్సీతో చక్రాల కుర్చీకే పరిమితమైపోయిన 23 ఏళ్ల కేరళ యువతి సారిక, సివిల్ సర్వీస్ పరీక్షలో నెగ్గి, మనోబలంతో అనుకున్నది సాధించవచ్చని నిరూపించింది. యుపిఎస్సీలో 922వ ర్యాంకు సాధించిన సారిక గురించిన ఆసక్తికరమైన కథనమిది.



'నడవలేకపోయినా, చేతులు సహకరిస్తే అదే పది వేలు, అన్ని పనులకూ ఇతరుల మీద ఆధారపడే పరిస్థితి తప్పుతుంది' అనుకుంటారు దివ్యాంగులు. కానీ కేరళలోని కోజికోడ్‌కు చెందిన సారిక పరిస్థితి అంతకంటే దారుణం. సెరెబ్రల్ పాల్సీతో చేతులు కూడా సహకరించని పరిస్థితి ఆ అమ్మాయిది. అయినా వైకల్యాన్ని అధిగమించి అందలాలను అందుకున్న వాళ్ల కథల నుంచి ఆ అమ్మాయి ప్రేరణ పొందింది. సివిల్ సర్వీసెస్‌లో నెగ్గి, అనుకున్నది సాధించడానికి వైకల్యం అడ్డు రాదని నిరూపించాలని అనుకుంది. మొదటిసారి పరీక్షలో నెగ్గలేకపోయినా, రెండోసారి 2023 యుపిఎస్సీలో 922వ ర్యాంకును సాధించగలిగింది. ఆ ఘనత, తన ఉపాధ్యాయులు తల్లితండ్రులు, స్నేహితులకే దక్కుతుందని అంటున్న సారిక... "నా సంతోషాన్ని ఎలా వ్యక్తం చేయాలో తెలియడం లేదు. ఇది నేను ఊహించని విజయం" అంటూ తన సంతోషాన్ని మీడియాతో పంచుకుంది.

సవాళ్లను అధిగమించి

సివిల్ సర్వీసెస్ పరీక్ష రాయడం కోసం సరిత చేసిన ప్రయాణమంతా సవాళ్లతోనే సాగింది. పరీక్ష సెంటర్లను వెతుక్కుంటూ వెళ్లడం మొదలు, వారం రోజుల పాటు సాగే మెయిన్స్‌కు హాజరవడం వరకూ తనకెదురైన సవాళ్లన్నిటినీ ఆ అమ్మాయి పట్టుదలతో అధిగమించింది. ఐఏఎస్ అకాడమీ ఫౌండర్, మోటివేషనల్ స్పీకర్, డాక్టర్ జోబిన్ ఎస్ కొట్టాయం, కేరళలో ప్రాజెక్ట్ చిత్రశలభం అనే ట్రైనింగ్ ప్రోగ్రాంను లాంచ్ చేశాడు. దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా సివిల్ సర్వీస్ కోచింగ్ ఇవ్వడం ఆ ప్రోగ్రాం లక్ష్యం. అలా ఉచిత శిక్షణ తీసుకున్న సరిత, రెండోసారి సివిల్ సర్వీసెస్‌కు పట్టుదలతో సిద్ధపడింది. కోజికోడ్‌లో పరీక్ష హాల్ డిజేబుల్డ్ ఫ్రెండ్లీ కావడం కూడా సరితకు కలిసొచ్చింది. తిరువనంతపురంలో జరిగిన మెయిన్స్ కోసం కూడా సరితకు తగిన ఏర్పాట్లను కల్పించడం జరిగింది. పరీక్ష రాయడానికి కుడి చేయి సహకరించదు కాబట్టి సరిత స్క్రైబ్‌ను ఉపయోగించుకుంది. అంతిమంగా ఢిల్లీ ఇంటర్వ్యూకు హాజరయ్యే సమయానికి సరిత తండ్రి ఖతార్ నుంచి వచ్చి, కూతురికి సహాయపడ్డాడు. తన పుట్టినూరు కోజికోడ్‌ను గ్రాడ్యుయేషన్ సబ్జెక్ట్‌గా ఎంచుకోవడంతో, ఇంటర్వ్యూ మొత్తం ఆ దిశగానే సాగిందని ఇంటర్వ్యూ తర్వాత చెప్పుకొచ్చింది సరిత.

ఆమే నాకు ప్రేరణ

సాదాసీదా ఉద్యోగానికి బదులుగా, సివిల్ సర్వీసెస్ ఉద్యోగాన్నే లక్ష్యంగా ఎంచుకోవడం గురించి వివరిస్తూ... "చేతులు లేని లైసెన్స్‌డ్ పైలట్ 'జెస్సికా కాక్స్' నుంచి నేను ప్రేరణ పొందాను. మనోబలం, పట్టుదల కలిగి ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదు అనడానికి ఆవిడ కథే ఒక ఉదాహరణ' అంటూ వివరించిన సరిత, ప్రభుత్వోద్యోగంలో ఎదురయ్యే సవాళ్లను కూడా ఇంతే పట్టుదలతో అధిగమిస్తూ, ప్రజలకు సేవలందించడానికి శాయశక్తులా కృషి చేస్తానని కూడా అంటోందామె.

ఇక జోరుగా పీఎస్‌యూల విక్రయం!

ఎల్ఐసీ, జీఐసీలో వాటాల అమ్మకం



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో వాటాల విక్రయం మరింత జోరందుకోనుంది. లోక్‌సభ ఎన్నికలు ముగిసి మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ప్రభుత్వ రంగంలోని బీమా సంస్థలైన జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (జీఐసీ) ఈక్విటీలో 10 శాతం, ఎల్ఐసీ ఈక్విటీలో మరో 1.5 శాతం విక్రయానికి అధికారులు ఇప్పటికే రంగం సిద్ధం చేశారు. ఇందులో జీఐసీ ఈక్విటీలో 10 శాతం విక్రయం ద్వారా రూ.5,700 కోట్లు, ఎల్ఐసీ ఈక్విటీలో 1.5 శాతం విక్రయం ద్వారా కనీసం రూ.10,000 కోట్లు లభిస్తాయని అంచనా.

మరో మూడు బ్యాంకులు..

జీఐసీ, ఎల్ఐసీకి తోడు ఐడీబీఐ బ్యాంక్, ప్రభుత్వ రంగంలోని రెండు బ్యాంకుల ప్రైవేటీకరణ కూడా ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి చేసేందుకు అధికార వర్గాలు కసరత్తు పూర్తి చేశాయి. ఈ రెండు బ్యాంకులు ఏవనే విషయాన్ని ప్రభుత్వం ఇప్పటి వరకు బయటపెట్టలేదు. అయితే సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సీబీఐ), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) ఈ జాబితాలో ఉన్నట్టు సమాచారం. ఎన్ఎండీసీ అనుబంధ సంస్థ ఎన్ఎండీసీ స్టీల్ ప్రైవేటీకరణ కూడా ఈ ఆర్థిక సంవత్సరం పూర్తవుతుందని భావిస్తున్నారు.

విప్రో.. డీలా!



నిరాశాజనకంగా కంపెనీ ఆర్థిక ఫలితాలు

7.8% తగ్గి రూ.2,835 కోట్లకు పరిమితమైన క్యూ4 లాభం

అనిశ్చితులు అలాగే..

"గడిచిన ఆర్థిక సంవత్సరం ఐటీ పరిశ్రమకు పెద్ద సవాలుగా నిలిచింది. అది మా కంపెనీ పనితీరుపైనా ప్రభావం చూపింది. ఇప్పటికీ ఆర్థిక అనిశ్చితులు అలాగే కొనసాగుతున్నాయి. స్వల్పకాలికంగా మరిన్ని సవాళ్లు ఎదురుకావచ్చు. అయినప్పటికీ, అవకాశాలు అపరిమితం. మా ముందున్న అవకాశాలపై ఆశావహంగా ఉన్నాం. సాంకేతికంగా ఐటీ రంగం పెనుమార్పులకు లోనవుతోంది. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత అందుబాటులోకి రావడంతో క్లయింట్ల అవసరాలూ మారుతున్నాయి. ఎందుకంటే, వారు ఏఐ టెక్నాలజీ సాయంతో మార్కెట్ పోటీలో నిలబడటంతో పాటు వ్యాపార విలువను పెంచుకోవాలని చూస్తున్నారు. మేం కూడా ఇందుకు సిద్ధమవుతున్నాం. క్లయింట్లు తమ లక్ష్యాల సాధించేందుకు తోడ్పడే సామర్థ్యం, నాయకత్వం, 2.30 లక్షలకు పైగా నిపుణులైన సిబ్బంది మాకుంది. ఇందుకోసం మేం గణనీయంగా కసరత్తు చేయాల్సి ఉన్నప్పటికీ సమిష్టి కృషితో కంపెనీ భవిష్యత్ వృద్ధికి బాటలు వేస్తాం."

– శ్రీనివాస్ పల్లియా, సీఈఓ, విప్రో

- రూ.22,208 కోట్లకు జారిన ఆదాయం
- 9.5 శాతం తగ్గిన ఉద్యోగుల సంఖ్య
- ఉద్యోగుల వలసల రేటు 14.2 శాతం
- ఒక్కో షేరుకు రూపాయి డివిడెండ్

బెంగళూరు: ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరపు నాలుగో త్రైమాసికంలో (క్యూ4) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 7.8 శాతం క్షీణించి రూ.2,834.6 కోట్లకు పరిమితమైంది. ఆదాయం కూడా 4.2 శాతం తగ్గి రూ.22,208.3 కోట్లకు పడిపోయింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి సైతం విప్రో ఆదాయం వార్షిక ప్రాతిపదికన 0.8 శాతం తగ్గి రూ.89,760.3 కోట్లకు చేరుకోగా.. నికర లాభం 2.6 శాతం తగ్గుదలతో రూ.11,045.2 కోట్లుగా నమోదైంది. క్యూ4లో ఐటీ సేవల విభాగం నుంచి కంపెనీకి సమకూరిన ఆదాయం 265.7 కోట్ల డాలర్లుగా నమోదైంది. క్యూ3తో పోలిస్తే 0.1 శాతం అధికమిది. మరిన్ని విషయాలు..

- ఈ జూన్ 30తో ముగియనున్న 2024-25 ఆర్థిక సంవత్సరపు తొలి త్రైమాసికానికి (క్యూ1)లో ఐటీ సేవల వ్యాపారం ద్వారా కంపెనీకి సమకూరనున్న ఆదాయం (స్థిర కరెన్సీ ఆధారంగా) 261.7-267 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండవచ్చని విప్రో అంచనా వేసింది. అనగా, 2023-24 క్యూ4తో పోలిస్తే 2024-25 క్యూ1లో ఆదాయ వృద్ధి మైనస్ 1.5 శాతం నుంచి 0.5 శాతం శ్రేణిలో నమోదు కావచ్చని కంపెనీ భావిస్తోంది.
- క్యూ4లో 120 కోట్ల డాలర్ల విలువైన భారీ డీల్స్‌ను దక్కించుకున్నట్లు విప్రో వెల్లడించింది. క్యూ3లో లభించిన 90 కోట్ల డాలర్ల బడా కాంట్రాక్టులతో పోలిస్తే 31 శాతం అధికమిది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి భారీ డీల్స్ 460 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. కాగా, క్యూ4 మొత్తం బుకింగ్స్ 360 కోట్ల డాలర్లుగా, 2023-24 మొత్తానికి 1,490 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.
- ఈ జనవరి 12న నిర్వహించిన బోర్డు సమావేశంలో వాటాదారులకు ఒక్కో షేరుకు రూపాయి మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించారు. దీనికి బోర్డు సభ్యులు తాజాగా ఆమోదం తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను దీన్నే తుది డివిడెండ్‌గా పరిగణించడం జరుగుతుందని విప్రో స్పష్టం చేసింది.
- క్యూ4లో విప్రోలో నికరంగా 6,180 మంది ఉద్యోగులు తగ్గారు. త్రైమాసికం చివరినాటికి కంపెనీ ఉద్యోగుల సంఖ్య తగ్గడం వరుసగా ఇది ఆరోసారి. కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఉద్యోగుల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 9.5 శాతం (24,516 మంది) తగ్గడంతో ఈ మార్చి 31 నాటికి 2,34,054 మందికి పరిమితమైంది. గడిచిన దశాబ్దకాలంలో విప్రో ఉద్యోగుల సంఖ్య వార్షిక ప్రాతిపదికన తగ్గడం ఇది మూడోసారి. కాగా, కంపెనీ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 14.2 శాతంగా నమోదైంది.

చైర్మన్‌గా రిషద్ ప్రేమ్‌జీ పునర్నియామకం

మరో ఐదేళ్ల పాటు (2024 జూలై 31 నుంచి 2029 జూలై 30 వరకు) విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా రిషద్ ప్రేమ్‌జీ పునర్నియామకానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. అలాగే, మరో ఐదేళ్ల (2024 జూలై 31 నుంచి 2029 జూలై 30 వరకు) నాన్ ఎగ్జిక్యూటివ్, నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా అజీమ్ ప్రేమ్‌జీ పునర్నియామకానికి సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

గ్రీన్‌కో నుంచి అమర రాజా ఇన్‌ఫ్రాకు ఆర్డర్

న్యూఢిల్లీ: అమర రాజా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ (ఏఆర్ఐపీఎల్)కు గ్రీన్‌కో నుంచి భారీ కాంట్రాక్టు లభించింది. ఈ కాంట్రాక్టు కింద కంపెనీ కర్నూలు జిల్లాలోని ఉయ్యాలవాడ పట్టణ సమీపంలో గ్రీన్‌కో కోసం 2,200 ఎకరాల్లో 700 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తుంది. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో కంపెనీ ఈ ప్రాజెక్టు చేపడుతోంది. తాజా ఆర్డర్‌తో ఈ ఏడాది మార్చి చివరి నాటికి అమర రాజా ఇన్‌ఫ్రా చేతిలో ఉన్న ఆర్డర్ల విలువ రూ.1,516 కోట్లకు చేరింది.

'సినర్జీస్' కంపెనీ ఎండీ శేఖర్ మొవ్వా కన్నుమూత



కూర్మన్నపాలెం (విశాఖపట్నం): ప్రముఖ పారిశ్రామికవేత్త, 'సినర్జీస్' కాస్టింగ్స్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్ మొవ్వా హఠాన్మరణం చెందారు. ఆయన కంపెనీ పనిపై కొద్ది కాలం కిందట లండన్ వెళ్లారు. ఈ నెల 16వ తేదీన ఛాతీలో నొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షలు నిర్వహిస్తుండగా శేఖర్ తుదిశ్వాస విడిచారు. ఈ సమాచారం తెలిసి సంస్థ ఉద్యోగులు, దువ్వాడ వీఎస్ఈజెడ్‌లో పారిశ్రామికవేత్తలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన భౌతిక కాయం శనివారం విశాఖ నగరానికి తీసుకువస్తున్నట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా పలువురు పారిశ్రామికవేత్తలు మాట్లాడుతూ.. అల్లాయ్ వీల్స్ పరిశ్రమలో శేఖర్ ఎన్నో నూతన ఒరవడులను తీసుకువచ్చారన్నారు. పాతికేళ్ల క్రితం సినర్జీస్ పరిశ్రమను స్థాపించి ఎంతోమందికి జీవనోపాధిని కల్పించారన్నారు.

ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలు రాబోతున్నాయ్..!

2026లో అందుబాటులోకి

న్యూఢిల్లీ: దేశంలో మరో రెండేళ్లలో ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలు అందుబాటులోకి రాబోతున్నాయి. దేశీయ ఎయిర్‌లైన్స్ ఇండిగో యాజమాన్య సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌తో కలిసి అమెరికాకు చెందిన ఆర్చర్ ఏవియేషన్ ఈ ఎయిర్ ట్యాక్సీలను దేశంలో ప్రవేశపెట్టనుంది. వీటి ద్వారా ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ నుంచి హర్యానాలోని గురుగ్రామ్‌కు కేవలం 7 నిమిషాల్లో చేరుకోవచ్చు. ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.2,000- 3,000 వరకు వసూలు చేయనున్నట్లు ఆర్చర్ ఏవియేషన్ ఎగ్జిక్యూటివ్స్ తెలిపారు. ఈ 27 కిలోమీటర్ల రోడ్డు మార్గ ప్రయాణానికి గంటన్నర పడుతుందని, ట్యాక్సీ అద్దె రూ.1,500 వరకు అవుతుందన్నారు. అంటే, క్యాబ్ చార్జీతో పోలిస్తే 1.5 రెట్ల ధరకే నిమిషాల్లో గమ్యాన్ని చేరుకోవచ్చు. తొలుత ఢిల్లీ-గురుగ్రామ్‌తో పాటు ముంబై-బెంగళూరు మార్గంలోనూ ఈ సేవలు ప్రారంభించాలనుకుంటున్నట్లు ఆర్చర్ ఏవియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. భారత్‌లో ఎయిర్ ట్యాక్సీ సేవల ప్రారంభం కోసం గత ఏడాది నవంబరులో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌తో ఆర్చర్ ఏవియేషన్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

మార్కెట్లో పుల్‌బ్యాక్ ర్యాలీ

600 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్ నాలుగు రోజుల నష్టాలకు శుక్రవారం తెర దించింది. బ్యాంకింగ్, ఆటో షేర్లలో విలువ ఆధారిత కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ఫలితంగా సెన్సెక్స్ 599.34 పాయింట్లు లాభపడి 73,088.33 వద్ద ముగియగా నిఫ్టీ 151.15 పాయింట్లు లాభపడి 22,147 వద్ద క్లోజైంది. వారం మొత్తంలో సెన్సెక్స్ 1,156.57 పాయింట్లు, నిఫ్టీ 372 పాయింట్లు నష్టపోయాయి.

నెస్లే డౌన్: తక్కువగా అభివృద్ధి చెందిన కొన్ని దేశాల్లో శిశు పాల ఉత్పత్తులను అధిక చక్కెర శాతంతో విక్రయించిందన్న అభియోగాల నేపథ్యంలో నెస్లే షేరు పతనం కొనసాగుతోంది. బీఎస్ఈలో శుక్రవారం ఈ షేరు ఇంట్రాడేలో 3.53 శాతం నష్టంతో రూ.2,375.75 స్థాయికి దిగజారింది. అయితే చివరికి 1.04 శాతం నష్టంతో రూ.2,437.10 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో కూడా 1.32 శాతం నష్టంతో రూ.2,430 వద్ద ముగిసింది.

23న ఎంఫోర్స్ ఆటోటెక్ ఇష్యూ: ఆటో విడిభాగాల తయారీదారు ఎంఫోర్స్ ఆటోటెక్ ఐపీఓ వచ్చే మంగళవారం ప్రారంభమై గురువారం ముగుస్తుంది. ఇష్యూలో భాగంగా 54.99 లక్షల తాజా ఈక్విటీ షేర్లు జారీ చేయడం ద్వారా రూ.54 కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. షేరు ధర శ్రేణిని రూ.93-98గా నిర్ణయించారు. ఈ షేర్లను బీఎస్ఈ ఎస్ఎంఈ సూచీలో లిస్టింగ్ చేస్తారు.

కెనరా స్టాక్ విభజన: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ షేర్ల విభజనకు రికార్డు తేదీని మే 15గా నిర్ణయించింది. ఆ తేదీకి బ్యాంక్ షేర్లున్న వారందరూ దీనికి అర్హులవుతారు. ఒక్కోటి రూ.10 ముఖ విలువ గల షేర్లను ఒక్కోటి రూ.2 విలువ గల ఐదు షేర్లుగా విభజించేందుకు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు ఫిబ్రవరిలో ఆమోదముద్ర వేసింది.

బంగారం అ'ధర' హో: బులియన్ మార్కెట్లో బంగారం ధర ఎక్కడా వెనుక చూపే లేదన్నట్టుగా పరుగులు తీస్తోంది. ఢిల్లీ మార్కెట్లో శుక్రవారం 10 గ్రాముల బంగారం ధర రూ.400 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.74,100 పలికింది. కిలో వెండి ధర కూడా రూ.100 పెరిగి కొత్త రికార్డు స్థాయి రూ.86,600 పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 15 డాలర్లు పెరిగి 2,390 డాలర్లకు చేరింది. వెండి కూడా ఔన్సు 28.29 డాలర్లు పలికింది.

ఐటీలో ఆగని సంక్షోభం

64,000 మంది ఉద్యోగులు బయటకు

బెంగళూరు: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో సంక్షోభం కొనసాగుతోంది. ఈ ప్రభావం ఉద్యోగుల మీదా పడుతోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) మూడు అగ్రశ్రేణి ఐటీ దిగ్గజ కంపెనీలు టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో కంపెనీలు 64,000 మంది ఉద్యోగులను బయటికి పంపించాయి. ఇందులో ఇన్ఫోసిస్ 24,994 మందిని,విప్రో 24,516 మందిని, టీసీఎస్ 13,244 మందిని ఇంటికి పంపించాయి.చిన్న,మధ్య తరహా ఐటీ కంపెనీలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య లక్షకు పైనే ఉంటుందని అంచనా. అయితే ఇందులో కొందరు ఉద్యోగాలు మారిన వారు కూడా ఉన్నారు.

తీసివేతలకు కారణాలు..

- అమెరికా, ఐరోపా దేశాల్లో ఆర్థిక సంక్షోభం తలెత్తటం
- కంపెనీలు తమ ఐటీ బడ్జెట్‌లను గణనీయంగా తగ్గించడం
- ఆర్డర్లు తగ్గడంతో కంపెనీలు ఉద్యోగుల కోతలకు దిగడం
- కొంతమంది ఉద్యోగులు సరికొత్త టెక్నాలజీలను సరిగా నేర్చుకోలేక పోవడం
- తయారీ, బీఎఫ్ఐఎస్ రంగాల్లో మంచి అవకాశాలు లభించడం

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,340 ▲	68,150 ▲	90,000 ▼
ముంబై	73,404 ▼	67,236 ▼	82,853 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ

హైదరాబాద్	410	విజయవాడ	415
వరంగల్	412	గోదావరి	415
చిత్తూరు	493	విశాఖపట్నం	430

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	118	విజయవాడ	131
వరంగల్	118	గుంటూరు	131
కరీంనగర్	118	ఒంగోలు	131
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	134
కర్నూలు	118	నెల్లూరు	134
విశాఖపట్నం	118	అనంతపురం	131
గోదావరి	131		

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: ఢిల్లీ

ఢిల్లీ X హైదరాబాద్

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
361 (7 మ్యాచ్‌లు)	13 (7 మ్యాచ్‌లు)

లఖ్‌నవూ సూపర్

చెన్నైపై ఘనవిజయం

రాహుల్, డికాక్ అర్ధసెంచరీలు

తేలిపోయిన సీఎస్‌కే బౌలర్లు

లఖ్‌నవూ: హ్యాట్రిక్ విజయాలపై కన్నేసిన చెన్నై సూపర్ కింగ్స్‌కు ఝలక్. అటు రెండు వరుస ఓటముల తర్వాత లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విజయాల బాట పట్టింది. సొంత మైదానమంతా పసుపుమయం అయినప్పటికీ.. ఆల్‌రౌండ్ షోతో అదుర్స్ అనిపించింది. ముందుగా బౌలర్లు సీఎస్‌కేను ఓ మాదిరి స్కోరుకే కట్టడి చేయగా.. ఆ తర్వాత ఓపెనర్లు కెప్టెన్ రాహుల్ (53 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 82), డికాక్ (43 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 54) శతక భాగస్వామ్యంతో విజయాన్ని ఖాయం చేశారు. చెన్నై బౌలర్లు ఈ మ్యాచ్‌లో పూర్తిగా తేలిపోయారు. దీంతో 8 వికెట్ల తేడాతో గెలిచిన లఖ్‌నవూ 8 పాయింట్లతో నిలిచింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్లకు 176 పరుగులు సాధించింది. జడేజా (40 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 57 నాటౌట్), రహానె (36), మొయిన్ అలీ (30), ఎంఎస్ ధోనీ (9 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 28 నాటౌట్) రాణించారు. క్రునాల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో లఖ్‌నవూ 19 ఓవర్లలో 2 వికెట్లకు 180 పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రాహుల్ నిలిచాడు.



ధోనీ (9 బంతుల్లో 28 నాటౌట్)

అలవోకగా..: స్లో పిచ్‌పై ఛేదన లఖ్‌నవూకు కూడా కష్టంగా మారుతుందనిపించినా.. ఓపెనర్లు రాహుల్, డికాక్ ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుకుసాగారు. వికెట్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలించడంతో ఈ ఇద్దరూ శతక భాగస్వామ్యంతో చెన్నై బౌలర్లను ఆటాడేసుకున్నారు. ముఖ్యంగా రాహుల్ దూకుడుకు స్కోరు 11 ఓవర్లలోనే వంద దాటడం విశేషం. బంతి చక్కగా బ్యాట్ మీదికి రావడంతో రాహుల్ ఆరంభం నుంచే వేగంగా ఆడాడు. మూడో ఓవర్‌లో 4,6.. ఆరో ఓవర్‌లో 4,6 బాదడంతో పవర్‌ప్లేలో 54 రన్స్ చేసింది. 11వ ఓవర్‌లో మరో రెండు ఫోర్లతో రాహుల్ 31 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అటు డికాక్ కూడా చక్కగా సహకరిస్తూ 40 బంతుల్లోనే ఈ ఫీట్ సాధించాడు. ఈ దశలో వికెట్ కోసం చెన్నై ఎదురుచూపులకు తెర దించుతూ 15వ ఓవర్‌లో ముస్తాఫిజుర్.. డికాక్ వికెట్ తీశాడు. దీంతో తొలి వికెట్‌కు 134 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. కానీ అప్పటికి ఎల్ఎస్‌జీ విజయానికి 30 బంతుల్లో 43 పరుగులే అవసరమయ్యాయి. 17వ ఓవర్‌లో పూరన్ రెండు, రాహుల్ ఓ ఫోర్‌తో 15 రన్స్ వచ్చాయి. తర్వాతి ఓవర్‌లో జడేజా డైవింగ్ క్యాచ్‌తో రాహుల్ వెనుదిరిగినా లఖ్‌నవూకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయింది. పూరన్ (23 నాటౌట్), స్టొయినిస్ (8 నాటౌట్) మరో ఓవర్ ఉండగానే మ్యాచ్‌ను ముగించారు.



రాహుల్ (53 బంతుల్లో 82)

1 ఐపీఎల్‌లో ఎక్కువ 50+ స్కోర్లు (25) సాధించిన వికెట్‌కీపర్‌గా రాహుల్. ధోనీ (24)ని అధిగమించాడు.

జడేజా నిలకడ, ధోనీ మెరుపులు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై ఆరంభం నుంచే తడబడింది. పరుగులు కష్టంగా మారిన ఈ పిచ్‌పై లఖ్‌నవూ బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లను తీస్తూ ఒత్తిడి పెంచారు. కానీ ఆఖరి రెండు ఓవర్ల సమయంలో బరిలోకి దిగిన ఎంఎస్ ధోనీ మాత్రం ఎలాంటి ఇబ్బంది లేకుండా ధనాధన్ షోతో మురిపించాడు. జడేజా అజేయ అర్ధసెంచరీతో నిలువగా జట్టు సవాల్ విసిరే స్కోరందుకోగలిగింది. పేసర్ మొహిసిన్ అద్భుత బంతికి ఓపెనర్ రచిన్ రెండో ఓవర్‌లోనే గోల్డెన్ డకౌట్ అయ్యాడు. ఆ తర్వాత కెప్టెన్ రుతురాజ్ (17) సైతం నిరాశపరుస్తూ పేసర్ యష్‌కు దొరికిపోయాడు. అటు ఓపెనర్‌గా రహానె ఈసారి ఫామ్‌ను చాటుకున్నాడు. మూడో ఓవర్‌లో సిక్సర్ బాదిన తను ఐదో ఓవర్‌లో రెండు వరుస ఫోర్లు సాధించడంతో పవర్‌ప్లేలో జట్టు 51/2 స్కోరుతో నిలిచింది. అనంతరం పరుగులు మరీ నెమ్మదించగా వికెట్లు కూడా వేగంగా కోల్పోయింది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా బరిలోకి దిగిన జడేజాతో కలిసి రహానె మూడో వికెట్‌కు 35 పరుగులు జోడించాక తొమ్మిదో ఓవర్‌లో వెనుదిరిగాడు. క్రునాల్ అతడిని బౌల్డ్ చేశాడు. కాసేపటికే చెన్నైకి గట్టి దెబ్బ తగిలింది. ఫామ్‌లో ఉన్న శివమ్ దూబే (3)ను పేసర్ స్టొయినిస్ అవుట్ చేయగా.. తర్వాతి ఓవర్‌లోనే ఇంపాక్ట్ ప్లేయర్ రిజ్వీ (1)ని క్రునాల్ దెబ్బతీశాడు. దీంతో జట్టు 90/5 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ దశలో బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో 34 బంతుల పాటు కనీసం ఫోర్ కూడా నమోదు కాలేదు. అతికష్టంగా 15వ ఓవర్‌లో స్కోరు వంద దాటింది. అటు 34 బంతుల్లో జడ్డూ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అయితే మొయిన్ అలీ 18వ ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సర్లతో చెన్నై శిబిరంలో ఊపును తెచ్చాడు. ఆరో వికెట్‌కు 51 పరుగులు అందించాక తను అదే ఓవర్‌లో అవుట్ కావడంతో ఎంఎస్ ధోనీ బరిలోకి దిగాడు. వచ్చిందే తడవుగా.. 300+ స్ట్రయిక్ రేట్‌తో 19వ ఓవర్‌లో 4,6తో 15 రన్స్. ఆఖరి ఓవర్‌లో 6,4,4తో 19 రన్స్ అందించడంతో స్కోరు 170 దాటింది.

స్కోరుబోర్డు

చెన్నై: రహానె (బి) క్రునాల్ 36, రచిన్ (బి) మొహిసిన్ 0, రుతురాజ్ (సి) రాహుల్ (బి) యశ్ 17, జడేజా (నాటౌట్) 57, దూబే (సి) రాహుల్ (బి) స్టొయినిస్ 3, రిజ్వీ (స్టంప్డ్) రాహుల్ (బి) క్రునాల్ 1, మొయిన్ అలీ (సి) బదోని (బి) బిష్ణోయ్ 30, ధోనీ (నాటౌట్) 28, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 176/6; వికెట్ల పతనం:** 1-4, 2-33, 3-68, 4-87, 5-90, 6-141; **బౌలింగ్:** హెన్రీ 3-0-26-0, మొహిసిన్ 4-0-37-1, యశ్ ఠాకూర్ 4-0-45-1, క్రునాల్ పాండ్యా 3-0-16-2, బిష్ణోయ్ 4-0-44-1, స్టొయినిస్ 2-0-7-1.

లఖ్‌నవూ: డికాక్ (సి) ధోనీ (బి) ముస్తాఫిజుర్ 54, రాహుల్ (సి) జడేజా (బి) పతిరన 82, పూరన్ (నాటౌట్) 23, స్టొయినిస్ (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 19 ఓవర్లలో 180/2; వికెట్ల పతనం:** 1-134, 2-161; **బౌలింగ్:** దీపక్ చాహర్ 3-0-26-0, తుషార్ దేశ్‌పాండే 4-0-42-0, ముస్తాఫిజుర్ 4-0-43-1, జడేజా 3-0-32-0, పతిరన 4-0-29-1, మొయిన్ అలీ 1-0-5-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర‌రే
రాజస్థాన్	7	6	1	0	12	0.677
కోల్‌కతా	6	4	2	0	8	1.399
చెన్నై	7	4	3	0	8	0.529
హైదరాబాద్	6	4	2	0	8	0.502
లఖ్‌నవూ	7	4	3	0	8	0.123
ఢిల్లీ	7	3	4	0	6	-0.074
ముంబై	7	3	4	0	6	-0.133
గుజరాత్	7	3	4	0	6	-1.303
పంజాబ్	7	2	5	0	4	-0.251
బెంగళూరు	7	1	6	0	2	-1.185

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర‌రే: నెట్ రన్‌రేట్

నన్నూ చుట్టేసింది ధోనీ మేనియా!

స్టెయిన్

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ధోనీకి ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఇక మహీకి ఇదే ఆఖరి ఐపీఎల్ అని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ సీజన్‌లో చెన్నై జట్టు మ్యాచ్‌ల కోసం అభిమానులు స్టేడియాలకు పోటెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో మహీ మేనియా తననూ ఆవహించిందంటున్నాడు సఫారీ మాజీ పేసర్ డేల్ స్టెయిన్. 'ధోనీ మేనియా.. నాతోపాటు సౌతాఫ్రికానూ చుట్టుముట్టేసింది. నేను టీవీ ఎక్కువగా చూడను. కానీ ఐపీఎల్ అందునా మహీని చూడడం కోసం టీవీకి అతుక్కుపోతున్నా. అలా గంటలకొద్దీ ఆన్ చేసి ఉంచుతుండడంతో టీవీ పగిలిపోతుందని నా గర్ల్‌ఫ్రెండ్ పరిహాస మాడుతోంది' అని డేల్ సరదాగా చెప్పుకొచ్చాడు.

తెలుగు మూలాల ఇంగ్లండ్ క్రికెటర్ రామన్ సుబ్బా రో మృతి



న్యూఢిల్లీ: తెలుగు మూలాలున్న ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ రామన్ సుబ్బా రో (92) వృద్ధాప్య సమస్యలతో మరణించినట్టు ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు గురువారం ప్రకటించింది. 1958లో ఇంగ్లండ్ తరఫున టెస్ట్ అరంగేట్రం చేసిన ఆయన 1961 వరకు 13 మ్యాచ్‌లు ఆడారు. 29 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరైన సుబ్బా రో 'ఫస్ట్‌క్లాస్'లో కేంబ్రిడ్జ్ వర్సిటీ, సర్రే, నార్తంప్టన్‌షైర్ జట్లకు ఆడారు. ఆటకు వీడ్కోలు పలికాక 1992-2001 మధ్య 41 టెస్టులు, 119 వన్డే మ్యాచ్‌లకు రెఫరీగా వ్యవహరించారు. ఇప్పటిదాకా..జీవించి ఉన్న పెద్ద వయస్సు ఇంగ్లండ్ క్రికెటర్‌గా ఆయన ఖ్యాతి గాంచారు. అతని తండ్రి పంగులూరి వెంకట సుబ్బారావు బాపట్లకు సమీపంలోని జమ్ములపాలెం నుంచి 1913లో ఉన్నత విద్యకోసం ఇంగ్లండ్ వెళ్లి స్థిరపడ్డారు. తల్లి ఇంగ్లండ్‌కు చెందిన డోరిస్ మిల్డ్రెడ్ పిన్నర్. రామన్ సుబ్బా రో మృతికి ఐసీసీ ప్రగాఢ సంతాపం తెలిపింది.

ఫైనల్లో యుకీ జోడీ

మ్యూనిచ్ (జర్మనీ): భారత టెన్నిస్ స్టార్ యుకీ భాంబ్రీ బవేరియన్ ఇంటర్నేషనల్ టోర్నీలో డబుల్స్‌లో ఫైనల్ చేరాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో యుకీ/అల్బానో అల్బానో (ఫ్రాన్స్) ద్వయం 6-1, 6-7(5-7), 10-7తో ఆస్ట్రియా జంట అలెగ్జాండర్/లుకాస్‌పై నెగ్గింది.

ఫ్చ్.. కొద్దిలో మిస్

జిమ్నాస్ట్ దీపకు చేజారిన పతకం

వరల్డ్‌కప్‌లో నాలుగోస్థానం




న్యూఢిల్లీ: భారత స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ మరోసారి అంతర్జాతీయ వేదికపై ఆకట్టుకునే ప్రదర్శన చేసింది కానీ.. తృటిలో పతకం చేజార్చుకుంది. దోహ వేదికగా జరిగిన ఎఫ్ఐజీ ఆపరేటస్ వరల్డ్‌కప్‌లో మహిళల వాల్ట్ ఈవెంట్‌లో దీప నాలుగోస్థానంలో నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌కు క్వాలిఫయింగ్ ఈవెంట్ అయిన ఈ టోర్నీలో దీప.. శుక్రవారం జరిగిన వాల్ట్ విభాగం ఫైనల్స్‌లో 13.333 స్కోరు చేసి కొద్దిలో కాంస్యాన్ని కోల్పోయింది. జార్జివా వాలెంటినా (బల్గేరియా) 13.466 పాయింట్లతో మూడోస్థానంలో నిలిచి కంచు పతకాన్ని దక్కించుకుంది. పనామా జిమ్నాస్ట్ నవాస్ కార్లా (13.850)కు స్వర్ణం, కొరియాకు చెందిన ఆన్ చాంగ్ ఓక్ (13.833)కు రజతం లభించాయి. మరో భారత అమ్మాయి ప్రణతి నాయక్ క్వాలిఫయింగ్ రౌండ్‌లోనే వెనుదిరిగింది. గతంలో రెండుసార్లు మోకాలికి ఆపరేషన్ కారణంగా ఫామ్ కోల్పోయిన 30ఏళ్ల దీప.. ఆమధ్య డోపింగ్ నిబంధనల ఉల్లంఘనతో దాదాపు రెండేళ్ల సస్పెన్షన్‌కు గురైంది. దీంతో ఇప్పటికీ ఒలింపిక్స్ బెర్త్ వేటలోనున్న దీపకు పారిస్ టిక్కెట్ అందుకునేందుకు వచ్చేనెల 16 నుంచి ఉజ్బెకిస్థాన్‌లో జరిగే ఆసియా చాంపియన్‌షిప్ చివరి అవకాశం కానుంది.

ఒలింపిక్ ట్రయల్స్‌లో ఇషా టాప్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ ట్రయల్స్ తొలి రోజు పోటీల్లో హైదరాబాద్ యువ షూటర్ ఇషా సింగ్ టాప్‌లో నిలిచింది. శుక్రవారం ఇక్కడ జరిగిన ట్రయల్స్ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో ఇషా 585 పాయింట్లు సాధించింది. సీనియర్లు సిమ్రన్‌ప్రీత్ కౌర్ (583), మనూ భాకర్ (582) తర్వాతి రెండు స్థానాలతో సరిపెట్టుకున్నారు. పురుషుల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో భవేష్ (580) టాప్‌లో నిలవగా, విజయ్‌వీర్ సిద్ధు (579), అనీష్ (578) తర్వాతి స్థానాల్లో నిలిచారు. శనివారం ఫైనల్స్ జరుగుతాయి.

అగ్రస్థానానికి గుకేష్



టొరంటో: భారత యువ గ్రాండ్ మాస్టర్ గుకేష్ క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో మళ్లీ అగ్రస్థానానికి చేరుకోగా, తాజా ఫలితాలతో ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతీ టైటిల్ రేసు నుంచి దాదాపు దూరమయ్యారు. 12వ రౌండ్‌లో నిజత్ అబసోవ్(అజర్‌బైజాన్)పై గుకేష్ సంచలన విజయం సాధించాడు. నెపోమ్నియాచి (రష్యా)తో గేమ్ ను ప్రజ్ఞానంద డ్రా చేసుకోగా, ఫాబియానో (అమెరికా) చేతిలో విదిత్ ఓడాడు. మహిళల విభాగంలో అలెగ్జాండ్రా గోరియాచ్కినా (రష్యా)తో గేమ్‌ను హంపి డ్రా చేసుకోగా, అన్నా ముజిచుక్(ఉక్రెయిన్)పై వైశాలి గెలిచిం ది. మొత్తం 12 రౌండ్లు ముగిసే సరికి గుకేష్ (7.5) టాప్‌లో, నకమురా (అమెరికా-7.5) రెండో స్థానంలో ఉన్నారు. మహిళల్లో టాన్ జాంగీ (చైనా) 8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, హంపి 6 పాయింట్లతో 4వ, వైశాలి 5.5 పాయింట్లతో 6వ స్థానంలో కొనసాగుతున్నారు.

రెజ్లర్లకు నిరాశ

బిష్కెక్ (కజకిస్థాన్): ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో తొలిరోజు భారత రెజ్లర్లకు నిరాశే ఎదురైంది. శుక్రవారం ఇక్కడ జరిగిన 57 కిలోల విభాగంలో అమన్ సెహ్రావత్ సెమీస్‌లో ఓడిపోగా.. స్టార్ రెజ్లర్ దీపక్ పూనియా, సుజీత్ కల్కల్ వెయింగ్‌కు ఆలస్యంగా రావడంతో వారి ఎంట్రీని తిరస్కరించారు. కాగా మహిళల విభాగం పోటీలు శనివారం జరుగుతాయి.



అట్టహాసంగా శ్రావణ్‌కుమార్ నామినేషన్

ఎంపీ అభ్యర్థి పెమ్మసానితో కలిసి దాఖలు ● కదంతొక్కిన టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు



రిటర్నింగ్ అధికారి గంగరాజుకు నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న తెనాలి శ్రావణ్‌కుమార్



బీ మాయ!

కేంద్రం ఇచ్చే 50 శాతం వాటా ఇప్పుడు లేనప్పటికీ దేశంలో ఎక్కడా లేనివిధంగా పూర్తి ఖర్చు రాష్ట్రమే భరిస్తూ ఉచిత బీమా అమలు చేస్తోంది. కుటుంబంలో సంపాదించే వ్యక్తిని కోల్పోయి నిస్సహాయ స్థితిలోని నిరుపేద కుటుంబాలకు ఆలంబనగా జగనన్న ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ వైఎస్సార్ బీమా..! - ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్సార్ బీమాపై చెప్పిన మాటలు... కానీ ఆచరణ అందుకు పూర్తి విరుద్ధం గా వుంది. ప్రీమియం చెల్లించని కారణంగా అనేక మంది కార్మికులు ఈ పథకానికి దూరమ య్యారు. కరోనా బారినపడి చనిపోయిన వందలాది కుటుంబాలకు ఈ పథకం వర్తించ లేదు. అందుకు కారణం వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుంచి బీమా పథకానికి ప్రీమియం చెల్లించకపోవడమే!

- తండ్రి పేరు పెట్టి చంద్రన్న బీమాకు కొర్రీలు
- పూర్తిగా నీరుగారిన కార్మిక సంక్షేమ పథకం
- 5 లక్షల నుంచి 2 లక్షలకు పడిపోయిన లబ్ధిదారులు
- ఐదేళ్లుగా పెండింగులో క్లెయిమ్‌లు 11 కోట్ల బకాయిలు
- మహిళలకు పూర్తిగా మొండిచేయి చూపిన ప్రభుత్వం

గుంటూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన అతిపెద్ద కార్మిక సంక్షేమ పథకం చంద్రన్న బీమా! ఈ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నీరు కార్చేసింది. ఈ పథకానికి తన తండ్రి పేరు పెట్టుకున్న ముఖ్యమంత్రి ఆ పేరుకు నష్టం వాటిల్లుతుందన్న జంకు కూడా లేకుండా కార్మికులను వంచించారు. పథకంలో ఎక్కడికక్కడ కొర్రీలు పెట్టి పథకాన్ని పూర్తిగా నీరుగార్చేశారు. చంద్రబాబు హయాంలో బీమాపై ధీమాతో వున్న కార్మికులు ఇప్పుడు ధీమా కరువై ఆందోళన చెందుతున్నారు.

నయవంచన..

టీడీపీ హయాంలో చంద్రన్న బీమా పథకం కింద సాధారణ మరణం అయితే యాభై ఏళ్ల వయస్సు ఉన్నవారికి రూ.2 లక్షలు, 50 ఏళ్లకు పైబడి 59 ఏళ్ల వయస్సు వారికి రూ.30 వేల బీమా పరిహారం అందించారు. కుటుంబంలో ఎవరు చనిపోయినా పరిహారం ఇచ్చేవారు. ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్సుతో సంబంధం లేకుండా వర్తింపజేశారు. రెండు నెలల్లోపే పరిహారం పంపిణీ చేశారు. కానీ జగన్ ప్రభుత్వం వచ్చాక పథకం కుచించుకుపోయింది. 2021 వరకూ పథకం ఊసే ఎత్తకపోవ డంతో అప్పటి వరకూ పథకం అమలులో లేకుండా పోయింది. ఫలితంగా 2019- 21 మధ్య కాలంలో చనిపోయిన, అందునా కరోనా కాలంలో చనిపోయి సర్వస్వం కోల్పోయిన కష్టజీవులకు ఈ పథకం వర్తించలేదు. దీంతో అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కాగా 2021-22లో వైఎస్సార్ బీమా కింద పథకాన్ని అమలు చేసినా అది ఏమాత్రం ఉపయోగం లేనిదిగా మారిపోయింది. 18- 50 ఏళ్ల ఉండి సంపాదించే వ్యక్తి సహజ మరణం చెందితే ఆ కుటుంబానికి ఇచ్చే పరిహారాన్ని రూ.2 లక్షల నుంచి రూ.లక్షకు తగ్గించారు. 18- 70 ఏళ్ల మధ్య ఉండి సంపాదించే వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందించాలి.

మట్టి ఖర్చులూ ఇవ్వడం లేదు

బాధితులు మృతి చెందిన రోజునే మట్టి ఖర్చుల కింద రూ.10వేలు చెల్లించాల్సి ఉంది. నెలలు గడిచినా ఇవ్వడం లేదు. ప్రమాద మరణాలకు సంబంధించి ఎఫ్ఐఆర్, డెత్ సర్టిఫికేట్, పోస్ట్‌మార్టం నివేదిక ఉంటేనే పరిహారం వస్తుందని అధికారులు చెబుతున్నారు. రహదారి ప్రమాదాల్లో చనిపోతే డ్రైవింగ్ లైసెన్స్ నిబంధన కచ్చితం చేశారు. ఈ కారణంతో ఏటా వేలాది మందికి బీమా అందడం లేదు. కాగా కుటుంబ పెద్దలకు మాత్రమే పథకం వర్తిస్తుందన్న నిబంధన కారణంగా ఒకే కుటుంబంలో పనిచేసే ఇతర కార్మికులకు ఈ పథకం వర్తించడం లేదు. ఒకే ఇంట్లో భార్యాభర్తలుంటే పథకం భర్తకు మాత్రమే వర్తిసుండగా మిగిలిన కుటుంబ సభ్యులకు వృథా అవుతుంది.

వేలాది క్లెయిమ్‌లు పెండింగ్



ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 14లక్షల 91వేల 412 మంది వైఎస్సార్ బీమా కింద నమోదై వున్నారు. వారిలో 10లక్షల 21వేల 371 మంది మాత్రమే అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. మిగిలిన 3 లక్షల 96వేల మందిని ప్రభుత్వం అనర్హులుగా చేసింది. కాగా 2019 నుంచి ఇప్పటి వరకూ 18,032 క్లెయిములు నమోదవగా, వాటికి సంబంధించి ఇప్పటి వరకూ 8,313 క్లెయిములకు మాత్రమే ప్రభుత్వం పరిహారం చెల్లించింది. మిగిలిన క్లెయిములు ఇప్పటికీ పెండిం గులోనే వున్నట్లుగా తెలుస్తోంది. కాగా బీమా క్లెయి ముల విషయంలో ప్రభుత్వం, అధికారులు గోప్యతను ప్రదర్శిస్తున్నారు. క్లెయిముల వివరాలు డాష్‌బోర్డులో పెట్టకుండా జాగ్రత్త పడుతున్నారు. 2020- 24 మధ్య కాలానికి సంబంధించిన క్లెయిముల వివరాలు బయట కు రాకుండా అధికారులు జాగ్రత్త పడుతున్నారు. కాగా జిల్లాలో 6,878 క్లెయిములు పెండింగులో వున్నాయని, వాటి తాలూకు కార్మికులకు రూ.11 కోట్ల వరకు పరిహారం అందాల్సి వుందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

దగా మామ!

- తలనూనె, సబ్బులకు డబ్బులు ఇవ్వలేదు..
- వసతి గృహాల విద్యార్థులకు చెల్లించని కాస్మోటిక్ ఛార్జీలు
- నాలుగు రోజుల్లో వసతి గృహాలకు సెలవులు
- ఈ లోగా పిల్లలకు డబ్బు చెల్లించేనా ?



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకునే సంక్షేమ వసతి గృహాలు కాస్త సంక్షామ గృహాలుగా మారిపోయాయి. గిరిజన, బీసీ, ఎస్సీ గృహాల్లోని విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీల చెల్లింపులు నిలిచిపోయాయి. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండేది అధికంగా పేద పిల్లలు. తాము పడుతున్న కష్టం తమ పిల్లలకు ఉండకూడదన్న ఉద్దేశంతో కిలోమీటర్ల మేర దూరంతో ఉన్న వసతి గృహాలకు పంపుతుంటారు. ఉచిత వసతి, భోజనంతో పాటు, ఇతరత్రా చేతి ఖర్చులకు ప్రభుత్వమే డబ్బులు ఇస్తుందని భావించి చేర్పిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా పరిస్థితులున్నాయి. ప్రభుత్వం మాత్రం నెలవారీ కాస్మోటిక్ ఛార్జీల నగదు ఇవ్వడం లేదు. దీంతో తలకు నూనె కొనాలన్నా, స్నానానికి స బ ు ్బ కావాలన్నా ఇంటి నుంచి డబ్బు తెచ్చుకోవాల్సిన దుస్థితి. నాలుగు రోజుల్లో వసతి గృహాలకు సెలవులు కూడా ఇవ్వనున్నారు. ఈ లోగానైనా పిల్లల డబ్బు చెల్లిస్తారో లేదో?

వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రతి నెలా కాస్మోటిక్ ఛార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాలి. 7 నుంచి 10వ తరగతి వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున తలనూనె, సబ్బులు ఇతర సామాగ్రి కొనుగోలుకు ఇస్తుంటుంది. అన్ని తరగతులకు చెందిన బాలురకు రూ.30 చొప్పున హెయిర్ కటింగ్ ఛార్జీల కింద అదనంగా ఇవ్వాలి. విద్యార్థుల బ్యాంకు ఖాతాలకే నేరుగా కాస్మోటిక్ ఛార్జీలను జమచేయాలి. జూన్ నెలలో వసతి గృహాలు ప్రారంభమైతే రెండు నెలలకు సదరు ఛార్జీలు చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. తొమ్మిది నెలలుగా కాస్మోటిక్ ఛార్జీల ఊసేలేదు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి తమ అవసరాల నిమిత్తం డబ్బులు తెచ్చుకుంటున్నారు. ఇది వారి తల్లిదండ్రులకు భారంగా మారుతోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లోని విద్యార్థులకు నెలలు తరబడి కాస్మోటిక్ ఛార్జీలు విడుదల కావాల్సి ఉంది. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఆశ్ర యిస్తున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల బాలికలకు కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వడం లేదు. 2019 వరకు కాస్మోటిక్ కిట్‌లను బాలికలు పంపిణీ చేశారు. ఐదేళ్లుగా కాస్మోటిక్ కిట్‌ల పంపిణీని ప్రభుత్వం నిలిపి వేయడం గమనార్హం.



నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం



నల్లమడ వాగులో దట్టంగా పెరిగిన ముళ్లకంప



సెంట్రల్ లైటింగ్‌కు నోచుకోని ప్రత్తిపాడు ప్రధాన రహదారి

హామీలు.. నీటిమీద రాతలే

- మాటలకే పరిమితమైన జగన్ వాగ్దానాలు
- ప్రత్తిపాడులో కలగా మిగిలిన సెంట్రల్ లైటింగ్
- ఊసేలేని తాగునీటి పథకం, నల్లమడ వాగు ఆధునికీకరణ
- నిధులు లేక నీరసించిన గుంటూరు ఛానల్ భూసేకరణ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 19: మాట తప్పను.. మడమ తిప్పను అంటూ డాంభికాలు పలికే ముఖ్యమంత్రి జగన్ మాటలు నీటి మీద రాతలే అని తేటతెల్లం అవుతున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి ఆయన ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. ముఖ్యమంత్రి హోదాలో ప్రత్తిపాడు వచ్చిన ఆయన ఇచ్చిన హామీలు ఇంత వరకు పురోగతి సాధించలేదు. ముఖ్యమంత్రిగా జగన్ ఇచ్చిన ఒక్క హామీ అయినా పూర్తి చేయాలని కొందరు స్థానిక నాయకులు కాలుకు బలపం కట్టుకుని సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకుండా పోయింది. 2022 జనవరి 1న పింఛన్ల పెంపుకోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రత్తిపాడు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన వరాల జల్లు కురిపించారు. దీంతో ప్రత్తిపాడు రూపరేఖలతో పాటు ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు భావించారు. అయితే రోజులు.. నెలలు.. సంవత్సరాలు గడిచినా ఒక్క హామీకి సంబంధించి పనులు కూడా ప్రారంభం కాలేదు. పెదనందిపాడులో క్రీడా వికాశకేంద్రం నిర్మాణానికి రెండు కోట్లు, ప్రత్తిపాడులో తాగునీటి సమస్య పరిష్కారానికి 13 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పెదనందిపాడులో రెండు కోట్లతో పీహెచ్‌సీ నిర్మాణం, సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి రూ.7 కోట్లు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అయితే వీటిలో ఇంత వరకు ఒక్క పని కూడా ప్రారంభంకాలేదు. ప్రత్తిపాడు నుంచి గొట్టిపాడు మీదగా జాతీయ రహదారిని కలిపే రోడ్డును విస్తరణ చేసే పనులు ప్రారంభమైనప్పటికీ నిధులు విడుదలకాక కాంట్రాక్టర్ పరారయ్యారు.

- ప్రత్తిపాడు, పెదనందిపాడు, పర్చూరు మండలాలకు సంబంధించి సుమారు 50 గ్రామాలకు సాగు, తాగు నీటి సమస్య తీర్చే గుంటూరు ఛానల్ పొడిగింపు హామీ నిధులు కేటాయింపు లేక నీరసించిపోయింది. 420 ఎకరాల భూసేకరణ జరిగినా ప్రభుత్వం నుంచి రూపాయి కూడా మంజూరు కాలేదు.
- పెదనందిపాడు ప్రాంతంలో నల్లమడ వాగు ఆధునికీకరణ హామీ ఊసే లేకుండాపోయింది. 500 క్యూసెక్కుల నీరు పారే విధంగా చర్యలు తీసుకుంటానని జగన్ ఇచ్చిన హామీ నేటికి నెరవేరలేదు.
- ప్రత్తిపాడు ప్రధాన రహదారిలో సెంట్రల్ లైటింగ్ కలగానే మిగిలింది. రామవాగు నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.7 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రత్తిపాడు సభలో జగన్ ప్రకటించారు. కానీ ఇంత వరకు ఆ పనులే ప్రారంభం కాలేదు.

గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం డాక్టర్ కొల్లా రాజమోహన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రైతుల నిరాహార దీక్ష (ఫైల్ ఫోటో)



ఫేజ్-3కి.. బ్రేక్

- అతీగతిలేని ఇన్నర్‌రింగ్ రోడ్డు పనులు
- ఐదేళ్లుగా అంగుళం కూడా సాగని వైనం
- టీడీపీ హయాంలో మొదటి రెండు దశలు పూర్తి
- వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిలిచిన రూ.33 కోట్ల పనులు
- ప్రాధాన్య రోడ్డుపై పాలకులు నిర్లక్ష్యంతో ట్రాఫిక్ కష్టాలు



ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ 3 రహదారి

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 19: మహాత్మాగాంధీ ఇన్నర్‌రింగ్ రోడ్డు ఎంతో ప్రాధాన్యమైనది. మూడు దశల్లో నిర్మాణం జరగాల్సిన రహదారి మొదటి రెండు దశల్లోనే ఆగిపోయింది. టీడీపీ హయాంలో శరవేగంగా ఫేజ్ 1, ఫేజ్ 2 పూర్తి కాగా వైసీపీ హయాంలో ఫేజ్ 3 పనులు ఐదేళ్లుగా అంగుళం కూడా ముందుకు సాగలేదు. కనీసం ఈ రోడ్డు ఉందని, దీనిని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తమపై ఉందని గుర్తించలేని స్థితిలో పాలకులున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులే తప్ప గడచిన ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఒక్క పని కూడా చేపట్టలేదు. ఉమ్మడి జిల్లా కేంద్రమైన గుంటూరు నగర ప్రజలు నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పల్నాడు ప్రాంతం నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు గుంటూరు నగరంలో నుంచే వెళ్లాలి. దీంతో అటు నగరవాసులు, ఇటు సుదూర ప్రాంతాల నుంచి గుంటూరు మీదగా రాకపోకలు సాగించేవారు ఎంతో వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత తెలుగుదేశం ప్రభుత్వం గుంటూరు నగరానికి మహాత్మాగాంధీ ఇన్నర్‌రింగ్ రోడ్డును ఏర్పాటు చేయాలని భావించింది. మూడు దశల్లో ఈ రోడ్డును విస్తరించేలా ప్రణాళిక రూపొందించింది. ఈ రోడ్డు పూర్తి అయితే నగరవాసులతో పాటు పల్నాడు నుంచి విజయవాడ వైపు రాకపోకలు సాగించే వారికి ట్రాఫిక్ కష్టాలు తప్పుతాయి. ఈ క్రమంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మొదటి రెండు దశలకు భూ సేకరణతో పాటు పనులను శరవేగంగా పూర్తి అయ్యాయి. ఫేజ్-1 కింద గడ్డిపాడు నుంచి అమరావతి రోడ్డు వరకు, ఫేజ్ -2 కింద అమరావతి రోడ్డు నుంచి స్వర్ణ భారతినగర్ వరకు రోడ్డును పూర్తి చేశారు. అక్కడ నుంచి ఫేజ్-3 కింద పలకలూరు వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర పొడిగించాలని నిర్ణయించారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అప్పటి గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ సీఆర్‌డీయే నుంచి రూ.33 కోట్ల నిధులు మంజూరు చేయించారు. టెండర్లు పిలిపించి దాదాపు ల్యాండ్ అక్విజేషన్ పూర్తి చేశారు. రూ.33 కోట్లతో టెండర్లను పిలిచి పనులు మొదలుపెట్టారు. భూసేకరణకు సంబంధించి రైతులకు నగదు, టీడీఆర్ బాండ్లను కూడా అందజేశారు. అనేకచోట్ల రోడ్డు కూడా ఏర్పాటు చేశారు. అప్పట్లో గుంటూరు ఎంపీ జయదేవ్ ఈ రోడ్డుపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. దీంతో చకచకా పనులను జరిపించారు. కేవలం స్వర్ణ భారతీనగర్ వద్ద కొన్ని ఇళ్లు మాత్రమే తొలగించాలి. వారికి తగిన నష్టపరిహారం చెల్లించి, వారిని ఖాళీ చేయించే ప్రయత్నాలు ప్రారంభించే లోగా ఎన్నికలు వచ్చాయి. ఇంతలో 2019లో సార్వత్రిక ఎన్నికల రావడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత ఆ పనులు ఏమయ్యాయి అని అడిగిన వారే లేకుండా పోయారు. దీంతో గుంటూరు నగర వాసులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ప్రాధాన్యం కలిగిన ఈ రహదారిని అభివృద్ధి చేయడంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య ధోరణి కనబరిచింది. అందుకు తగ్గట్టుగానే కార్పొరేషన్ పాలకవర్గం కూడా ఏమాత్రం పట్టించుకోలేదు. ఎంతో ప్రాధాన్యం కలిగిన వాస్తవానికి ఈ రహదారి మూడు దశను పూర్తి చేసి ఉంటే గుంటూరు నగరంలోకి వాహనదారులు ప్రవేశంచకుండా నరసరావుపేట, సత్తెనపల్లి వంటి దూర ప్రాంతాలకు వెళ్ళవచ్చు. అదే విధంగా ఆయా ప్రాంతాల నుంచి గుంటూరు నగరంలోకి రాకుండానే మంగళగిరి, విజయవాడ జాతీయ రహదారిలోకి చేరుకోవచ్చు.



స్వర్ణభారతినగర్ వద్ద ఫేజ్ 3 పనులు మొదలు కావాల్సిన ప్రాంతం

కూటమి గెలిస్తేనే రైతులకు మేలు





నకరికల్లు మండలం కంకలగుంట గ్రామంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కన్నా లక్ష్మీనారాయణలకు ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు

- నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణ దేవరాయలు
- ఒక్క ఛాన్స్‌తో అందరినీ ముంచేశాడు
- మరోసారివస్తే ఇంకేం మిగలదు : కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, ఏప్రిల్ 19: ప్రతి ఏడాది సాగర్ జలాలు విడుదల కాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని టీడీపీ, జనసేన, బీజేపీ నరసరావుపేట కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. శుక్రవారం రాత్రి నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామంలో సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణతో కలసి ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ గోదావరి, పెన్నా నదుల అనుసంధానం ద్వారా ఏటా సాగర్ జలాలు అందు బాటులోకి రావటంతో పల్నాడుజిల్లా పాడిపంటలతో సస్య శ్యామలంగా మారుతుందన్నారు. కుంకలగుంటకు రూ.40 లక్షలు జలజీవన్‌మిషన్ నిధులు విడుదలైనా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు ఉన్నా ఈ ప్రభుత్వం పని చేయించుకోలేక పోయిందన్నారు. టీడీపీ అధికారంలోకి రావటంతో రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయని, 20 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. బీసీలకు బీసీకార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వటంతోపాటు బీసీ రక్షణచట్టం అమల్లోకి తెస్తామన్నారు. బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ అందిస్తామన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ప్రత్యేకంగా ఎస్సీలకే కేటాయిస్తామన్నారు. టీడీపీ కష్టకాలంలో అండగా ఉన్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు. కోరుకొని మరీ నేను పల్నాడుజిల్లా కేంద్రమైన నరసరావుపేట నుంచి పోటీ చేస్తున్నట్లు, విజ్ఞులైన పల్నాడు ప్రజలు తనను, ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే దోపిడీ, విధ్వంసం, అరాచకాలకు అడ్రస్‌గా మార్చారన్నారు. తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు, మూడుసార్లు ఆర్టీసీ చార్జీలు, ఆస్తి పన్ను, చెత్త పన్ను, డీసీల్, పెట్రోల్ ధరలనుపెంచి నిత్యవసర సరుకుల ధరలనూ పెంచారన్నారు. రాజధాని అభివృద్ధి, పోలవరం పూర్తి చేయటం, గోదావరి, పెన్నా నదుల అనుసంధానం టీడీపీతోనే సాధ్యం అన్నారు. ప్రజలు తనను, ఎంపీగా లావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సభాధ్యక్షునిగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య వ్యవహరించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి స్థానిక సమస్యలను ఎంపీ, కన్నా దృష్టికి తీసుకు వచ్చారు. వీటన్నింటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, ఘంటా జగదీష్ బాబు, టీ వెంగళరావు, రుసుం కోటయ్య, ఆవుల సుబ్బయ్య, మాజీ ఎంపీపీ సాగి కోటేశ్వరరావు, యాళ్ళ శ్రీనివాస సాయి బాబా, సాగి శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో కన్నా, పక్కన బాజీ చౌదరి, శౌరయ్య, సాయికృష్ణ

కన్నా, లావులకు బ్రహ్మరథం

సత్తెనపల్లి నియోజక వర్గ కూటమి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణకు, నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలకు శుక్రవారం రాత్రి కుంకలగుంట ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, మహిళలు ఘనస్వాగతం పలికారు. తొలుత కార్యసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో కన్నా పూజలు నిర్వహించారు. అనంతరం ప్రచార వాహనంపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో కన్నాను, లావును గజమాలలతో పార్టీ శ్రేణులు సత్కరించారు. బాణసంచా పేలుస్తూ ఎన్నికల ప్రచార యాత్ర పండుగను తలపింప చేసింది. టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలతో పార్టీ జెండాల రంగులతో, డప్పు వాయిద్యాలతో మారు మ్రోగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య, రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి, మండల టీడీపీ అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, ఘంటా జగదీష్ బాబు, వజ్రగిరి జయారాజు, బాదినేడు సుబ్బారావు, ఎం.సైదారావు, గోపు శ్రీనివాసరావు, సాతులూరి అప్పారావు, శ్రీను నాయక్, తాండ్ర వెంగళరావు, రుసుం కోటయ్య, ఆవుల సుబ్బయ్య, మాజీ ఎంపీపీ సాగి కోటేశ్వరరావు, యాళ్ళ శ్రీనివాస సాయి బాబా, సాగి శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

కుంకలగుంటలో చేరికలు ..

వైసీపీ నుంచి టీడీపీలోకి కుంకలగుంట ఉప సర్పంచ్ సింగరాజు అంకారావు, రామిశెట్టి ఈశ్వరయ్య, సింగరాజు చౌడయ్య, తాడికొండ సుబ్బారావులు టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి టీడీపీ నేతలు సాదరంగా ఆహ్వానించారు. కుంకలగుంటలో శుక్రవారం రాత్రి జరిగిన ఎన్నికల ప్రచార సభతో టీడీపీ తరుపున పోటీ చేస్తున్న కన్నా, లావు శ్రీ కృష్ణ దేవరాయలకు జోష్ పెంచింది. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంక్షేమాన్ని ప్రవేశపెట్టింది టీడీపీయే..



రేటూరు రోడ్ షోలో మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని పక్కన బీ. రామాంజనేయులు, తదితరులు

- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవలు ఎనలేనివి
- అధికారంలోకి రాగానే అంబేద్కర్ విదేశీ విద్య పేరును పునరుద్ధరిస్తాం
- బీజేపీపొత్తుతో ముస్లింలు ఆందోళన చెందవద్దు
- డాక్టర్‌పెమ్మసాని చంద్రశేఖర్

కాకుమాను, ఏప్రిల్ 19: రాష్ట్రంలో సంక్షేమాన్ని ప్రవేశపెట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని రేటూరు, అప్పాపురం, కాకుమాను గ్రామాలలో శుక్రవారం రోడ్ షోలతో పాటు, సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. తొలిసారి గ్రామానికి విచ్చేసిన పెమ్మసాని చంద్రశేఖర్‌కు మహిళలు, స్థానికులు ఎదురేగి వెళ్లి స్వాగతం పలికారు.

తొలుత రేటూరులో రోడ్ షోలో చర్చి వద్ద బీజేపీ, జనసేన, టీడీపీ పార్టీల ఉమ్మడి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కూడా విదేశాల్లో విద్యనభ్యసించారని తెలిపారు. హక్కుల పోరాటాల నుంచి రాజ్యాంగ నిర్మాణం వరకు అంబేడ్కర్ చేసిన సేవలు ఎనలేనివని తెలిపారు. స్ఫూర్తి ప్రదాత విగ్రహాల వలన ప్రేరణ పొంది సమాజానికి మంచి చేయాలని స్థానికులకు సూచించారు. అమరావతి రాజధానిలో 125 ఎకరాల్లో అంబేడ్కర్ స్మృతి వనాన్ని చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతిని నిర్వీర్యంలో చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు విదేశాలలో విద్యనభ్యసించాలనే ఉద్దేశ్యంతో అంబేడ్కర్ విదేశీవిద్య పేరుతో వారికి రూ.15 లక్షలు నిధులు మంజూరు చేశారని తెలిపారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అంబేడ్కర్ విదేశీ విద్య పేరును తొలగించారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు 2 లేదా 3 సెంట్ల ఇళ్ల పట్టాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం మసీదు వద్ద జరిగిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఆందోళన చెందవద్దన్నారు. బీజేపీతో పొత్తు అవసరం గురించి వివరించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్డీయే అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రపతి అభ్యర్థిగా భారతరత్న అబ్దుల్ కలాం ఆజాద్ పేరును సూచించి ఆయన గెలుపుకు పాటు పడ్డారన్నారు. అధికార వైసీపీ పార్టీ నుంచి గ్రామానికి చెందిన కమ్మ వెంకట్రావు, రషీద్‌లకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం అప్పాపురంలో జరిగిన రోడ్డు షోలో స్థానిక బొడ్డురాయి సెంటర్ వద్ద జరిగిన సభలో పెమ్మసాని మాట్లాడుతూ గ్రామాలలో తాగు, సాగు నీరు సమస్యలు ఉన్నాయని చెప్పారు. సాగు నీరు సమస్యకు సీఎం జగన్ పరోక్షంగా కారకుడని తెలిపారు. రైతులకు సాగుకు, ప్రజల త్రాగు నీరు, వాడుక నీరు అవసరాల గురించి పాలకుడికి అవగాహన లేకపోతే కొమ్మమూరు కెనాల్ ప్రక్క గ్రామాలకు కూడా నీటి ఎద్దడి ఏర్పడుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్‌ల గురించి ప్రజలు అప్రమత్తంగా లేకపోతే భవిష్యత్‌లో చాలా ప్రమాదాలు అని స్థానికులకు వివరించారు. మద్యంపై, ప్రజల ఆస్తులపై తాకట్టు పెట్టారని వివరించారు. ఉమ్మడి ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి రామాంజనేయులు మాట్లాడుతూ సీఎం జగన్‌కు కక్ష సాధింపు చర్యల రాజకీయాలకు తప్ప అభివృద్ధి తెలియదని అన్నారు. వలంటీర్‌ల ద్వారా ప్రజల డేటాను స్వీకరించారని తెలిపారు. ఆ డేటా ఎవరి వద్ద ఉందో కూడా తెలియని పరిస్థితికి జగన్ కారణమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, కొర్రపాటి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు అగస్టీన్, రాంగోపాల్, వీరయ్య చౌదరి, నువ్వుల సునీల్ చౌదరి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

భూమిని కబ్జా చేశారు



భూమి డాక్యుమెంట్‌లను చూపిస్తున్న సూర్యనారాయణ

- ఎమ్మెల్యే అనుచరులేనని బాధితుడి ఆరోపణ

నరసరావుపేటటౌన్, ఏప్రిల్ 19: ఉప్పలపాడు వద్దగల తన రెండెకరాలను ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేశారని నరసరావుపేట మండలం లింగం గుంట్లకు చెందిన చంద్రా సూర్యనారాయణ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని ఉప్పలపాడు సమీపంలోని జగనన్నకాలనీ సమీపంలోని కబ్జాకుగురైన తన భూమిని, డాక్యుమెంట్ చూపించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులైన బండి వెంకటేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి తన భూమిని అక్రమించారన్నారు. కర్నూలు-గుంటూరు హైవే పక్కనే ఉన్న ఆ భూమి విలువ ఇప్పుడు రూ.15 కోట్లు ఉంటుందన్నారు. ఈ విషయమై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశానన్నారు. ఈ మధ్య ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని కలిసి భూమి వివరాలు అందజేశానని, ఆయన నాకు ఏమి సంబంధం లేదని చెప్పారన్నారు. ఎమ్మెల్యేని కలిసిన తర్వాత తన భూమిలో షెడ్ వేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

మేము విజయవాడకు చెందిన వారి వద్ద కొన్నాం.. ఎమ్మెల్యే అనుచరుడైన నరసింహారెడ్డి మాట్లాడుతూ తాము ఉప్పలపాడు వద్ద ఆ భూమిని విజయవాడకు చెందిన వారివద్ద కొన్నామని ఫోనులో వివరించారు. సూర్యనారాయణ స్థానికుడు కావడంతో విజయవాడ వాళ్ళను భూమిలోకి రాకుండా చేయడానికి ఏవేవో చెబుతున్నారని, అతని వద్ద ఎలాంటి డాక్యుమెంట్‌లు లేవన్నారు.

అతిసారతో మంచం పట్టిన మంచాల

- కలుషిత నీటితో ప్రబలిన డయేరియా
- ఏ గృహానికి వెళ్లిన బాధితులే
- అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థులలో ఆగ్రహం

పొన్నూరుటౌన్(చేబ్రోలు), ఏప్రిల్19: చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో అతిసార ప్రబలింది. గ్రామంలో సుమారు 50 మందికి పైగా బాధితులు ఉన్నారు. గ్రామంలో కలుషిత నీరు వల్ల అతిసార ప్రబలిందని ప్రజలు ఆరోపించారు. గత రెండు రోజులుగా అతిసార విజృంభిస్తుంటే వైద్యాధికారులు కానీ, అధికారులు కానీ ఆ గ్రామం వైపు కన్నెతి చూడని పరిస్థితులు నెలకొన్నాయి. రెండు రోజుల క్రితం పదుల సంఖ్యలో ప్రజలు స్వల్ప లక్షణాలతో బాధపడటం గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం 50 మంది వరకు ఆసుపత్రి పాలు కావటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. కలుషిత నీరే డయేరియా ప్రబలటానికి కారణం అన్ని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం అతిసారా బాధితులు పెరిగిపోవటంతో వైద్యాధికారులు ఆశా వర్కర్లతో ఇంటింటి సర్వే చేపట్టారు. గ్రామంలో 35 మంది వరకు ఇంటి వద్దనే ఉండి వైద్య సేవలు పొందుతున్నారు. ఎనిమిది మందికి వ్యాధి తీవ్రత పెరగటంతో చేబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు.



చేబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతిసార బాధితులు

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం..

మంచాల గ్రామంలో అతిసార బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం అని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం మంచాలను డీఎం అండ్ హెచ్‌వో సందర్శించారు. అతిసార వ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే చేయించినట్లు చెప్పారు. అత్యవసర చికిత్స కోసం తరలించటానికి వీలుగా అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. వైద్య సిబ్బంది గ్రామంలోనే ఉండి పరిస్థితి చక్కపడే వరకు నిరంతర పర్యవేక్షణ చేయనునట్లు డీఎం అండ్ హెచ్‌వో తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి, బీసీ సంక్షేమం సంఘం ప్రతినిధులు

అన్నివర్గాల మద్దతు కూటమికే..

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 19: ఏ వర్గాన్ని వదిలి పెట్టకుండా అందరినీ అన్నిరకాలుగా సీఎం జగన్ రెడ్డి వేధింపులకు గురిచేశాడని, ఆ బాధిత వర్గాలందరూ ఇప్పుడు కూటమికే మద్దతు పలుకుతున్నారని మాజీ మంత్రి, ప్రత్తిపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం చిలకలూరిపేటలో ప్రత్తిపాటిని ఆంధ్రప్రదేశ్ బీసీసంక్షేమ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీలు, ఎస్సీలపై జరుగుతున్న దాడుల నియంత్రణ కోసం ఈ ఎన్నికల్లో ఎన్‌డీఏకు మద్దతుగా ఉంటామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటిని వారు శాలువాతో సత్కరించారు. అనంతరం పుల్లారావు బీసీనేతలతో కలసి విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సామాన్యుడికి కష్టం వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిని సీఎం జగన్‌రెడ్డి కల్పించారన్నారు. ప్రజలను అవస్థల పాలుచేస్తూ, వ్యవస్థలను మ్యానేజ్ చేస్తూన్న జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజా ధనాన్ని కొల్లగొట్టి అక్రమ సంపాదనతో

జగన్‌రెడ్డికి డబ్బులు ఉన్నాయి కదా? అని సామాజిక మాధ్యమాల్లో, చానెళ్లలో సర్వేలు వేయించుకోవటం తప్ప వాస్తవ సర్వేలన్నీ ఏకపక్షంగా టీడీపీ కూటమి గెలవబోతుందని చెపుతున్నాయన్నారు. జాతీయ స్థాయిలో ఏ సర్వే చూసినా కూటమికి 20కి పైగా లోకసభ సీట్లు వస్తాయని స్పష్టం చేస్తున్నాయన్నారు. అలాగే 160 అసెంబ్లీ సీట్లు గెలిచే స్థాయికి కూటమి ఖాయంగా కన్పిస్తోందన్నారు. రైతులు, యువతకు ముఖ్యమంత్రి తీరని ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. ఏటా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ఏమీ అమలు కాలేదన్నారు. చేయూత బటన్ నొక్కినట్లు ఆర్భాటంగా ప్రచారం చేసుకున్నా ఎవరి ఖాతాల్లో డబ్బులు పడలేదన్నారు. విద్యా దీవెన డబ్బులు పరిస్థితి కూడా అదే అన్నారు. ఇన్నిచేసి అబద్ధాలు, మోసంతో పొద్దుబుచ్చుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపటం ప్రతి ఒక్కరి కర్తవ్యం అని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. వైసీపీ దోపిడీ పర్వంలో 175 నియోజక వర్గాల్లో చిలకలూరిపేట, ఇక్కడి అవినీతి మంత్రి మొదటి స్థానంలో ఉంటారన్నారు. అనంతరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ తోట రాజా రమేష్ మాట్లాడుఏతూ బీసీల అభ్యున్నతి కోసం చంద్రబాబు, పవన్ పాటు పడుతున్నారని, జగన్ బీసీలకు 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసినా నిధులు, విధులు లేకుండా చేశారని దుయ్యబట్టారు. జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమితోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని, వారిపై దాడులు జరగకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలోనే బీసీ రక్షణ చట్టం తెస్తామన్నారు. కేంద్రంలో ప్రధానిగా బీసీ కులానికి చెందిన మోదీ ఉన్నారని, రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి పాల్పడే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉన్నారని, బీసీలు, మైనార్టీలు వారిని ఆశీర్వదించాలని రాజా రమేష్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి భానుగుంట్ల శ్రీనివాసరావు, నియోజక వర్గ అధ్యక్షులు కాకుమాను రమేష్, జిల్లా నాయకులు వెంకటరావు, కూరపాటి శివ శంకర్, పట్టణ అధ్యక్షుడు ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తల హల్‌చల్

- టీడీపీ డీజేపై పెట్రోలు పోసి నిప్పంటించే యత్నం

బెల్లంకొండ, ఏప్రిల్ 19: మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో గురువారం అర్ధరాత్రి వైసీపీ కార్యకర్తలు హల్‌చల్ చేశారు. టీడీపీకి చెందిన డీజేపై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వైసీపీ కార్యకర్తలపై ప్రతిఘటించటంతో ఘర్షణ తగ్గుముఖం పట్టించింది. విషయం తెలుసుకున్న బెల్లంకొండ ఎస్ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారించి బాధితుడిని చంద్రాజుపాలెం వైసీపీకి చెందిన గాదె నాగార్జునరెడ్డిని అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఇరువర్గాలను పిలిపించి బైండోవర్ చేస్తానని ఎస్ఐ రాజేష్ పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల టీడీపీ నాయకులు బెల్లంకొండ పోలీసు స్టేషన్‌కు వద్దకు చేరుకొని టీడీపీకి చెందిన డీజేపై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అరుణాచలంనకు ప్రత్యేక బస్సులు

గుంటూరు, ఏప్రిల్ 19: ఈనెల 23న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్‌సలాం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 21న రాత్రి 9.15 గంటలకు బయ ల్దేరి 22న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజురాత్రి అక్కడే బసచేసి 23న పౌర్ణమిరోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. ఆరోజే సాయంత్రం బయల్దేరి 24న ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుంద న్నారు. 96164 బస్సు సర్వీస్ నెంబర్‌కు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. చార్జీ ఒక్కరికి రూ.2420 ఉంటుందన్నారు. అదనపు సమాచారం కోసం 73828 97459 నంబరును సంప్రదించాలని డిపో మేనేజర్ అబ్దుల్ సలాం కోరారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల్లో గందరగోళం

- ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో రూల్


తెనాలి అర్బన్, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల విధానం గందర గోళంగా మారింది. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో రూల్ చెబుతూ ఉండటంతో దరఖాస్తు దారులు విస్తుపోతున్నారు. గత ఎన్నికల్లో ఎక్కడ విధులు నిర్వహిస్తున్నప్పటికీ తమకు ఓటు ఉన్న నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు ఇస్తే ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేయించేవారు. కానీ ఇప్పుడు అధికారులు చెబుతున్నది చూస్తే ఇందుకు భిన్నంగా వినపడుతుంది. ఏ నియోజకవర్గంలో ఓటు ఉన్నా పని చేస్తున్న నియోజకవర్గంలోనే పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు ఇవ్వాలని, వాటిని స్క్రూటీనీ చేసి ఆయా నియోజకవర్గాలకు పంపిస్తారని మళ్ళీ అక్కడి నుంచి పోస్టల్ బ్యాలెట్‌ను పని చేస్తున్న నియోజకవర్గానికి పంపుతారని, ఓటు వేశాక వాటన్నిటిని మళ్ళీ ఓటు ఉన్న నియోజకవర్గానికి పంపించే విధానాన్ని కొందరు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఎక్కడ తప్పు జరిగినా దరఖాస్తు దారు ఓటు హక్కు కోల్పోతారు. కొన్ని నియోజకవర్గాల్లో ఉద్యోగి ఏ జిల్లాలో పని చేస్తున్నప్పటికీ ఆ నియోజకవర్గంలో ఓటు ఉంటే దరఖాస్తు తీసుకుంటుండగా మరి కొన్ని నియోజకవర్గాల్లో తిరస్కరిస్తున్నారని చెబుతున్నారు. దీంతో ఏ నియోజకవర్గంలో ఏ నిబంధన అమలవుతుందో తెలియడం లేదంటూ వాపోతున్నారు. ఎన్నికల అధికారులు దీనిపై దృష్టి సారించి ఓటు ఉన్న నియోజకవర్గంలోనే పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు తీసుకుని అక్కడే ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



యరపతినేని సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు

టీడీపీలోకి వైసీపీ మాజీ ఎంపీటీసీలు

దాచేపల్లి, ఏప్రిల్ 19: గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో నారాయణపురంకు చెందిన మాజీ ఎంపీటీసీలు, వడ్డెర కార్మిక నాయకులు శుక్రవారం టీడీపీలో చేరారు. నారాయణపురం మాజీ ఎంపీటీసీ పల్లపు వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు విష్ణుమూర్తిలు, నడికుడి గ్రామానికి చెందిన వడ్డెర కార్మిక నేతలు, వడియ రాజుల సామాజికవర్గానికి చెందిన పల్లపు కృష్ణ, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, శంకరశివ, మోహన్‌రావు, నరసింహారావు, గురవారావు, తమ్మిశెట్టి కోటేశ్వరరావు, తమ్మిశెట్టి శంకరరావు, శ్రీనుబాబు, ముదిరాజులకు చెందిన వెంకటేష్, మరో 40 కుటుంబాలు టీడీపీలో చేరారు.



టీడీపీలో చేరిన కౌన్సిలర్ చంటీశ్వరి వెంకట నారాయణ తదితరులు

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్

సత్తెనపల్లి, ఏప్రిల్ 19 : పట్టణంలోని 2వ వార్డుకు చెందిన వైసీపీ కౌన్సిలర్ ఎం.చంటీశ్వరి వెంకట నారాయియణ శుక్రవారం వైసీపీని వీడి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. భార్యభర్తలు ఇద్దరికి కన్నా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారితోపాటు మరో 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కన్నా లక్ష్మీనారాణ వారందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేతలు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, దేవతి శివ ప్రసాదు, నూర్‌బాషా జానీబాబు, గుంటూరు ఆశీర్వాదం, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌రెడ్డి దెబ్బకు రోడ్డున పడ్డాం

- ఐదేళ్లపాటు అబద్ధాల కోరు పాలనే.. ● 1585వ రోజుకు ఆందోళనలు..

తుళ్ళూరు, ఏప్రిల్ 19: జీవనాధారమైన తమ భూములు రాజధాని అమరావతి కోసం ఇస్తే.. సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానుల మూడుముక్కలాట దెబ్బకు రోడ్డున పడ్డామని 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అమరావతి రాజధానిని కొనసాగించాలంటూ రైతు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుండి చేస్తున్న నిరసన దీక్షలు, ఆందోళనలు శుక్రవారం నాటికి 1585వ రోజుకు చేరుకున్నాయి. అమరావతిని బ్రహ్మాండంగా కడతామని చెప్పిన జగన్‌రెడ్డి మాట తప్పాడన్నారు. మూడు ముక్కలాటతో రాష్ట్ర ప్రగతిని దెబ్బతీసే వైసీపీని ఈ ఎన్నికలల్లో ఇంటికి పంపాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.



వెంకటపాలెంలో ధర్నా శిబిరంలో మహిళలు ఆందోళన

77,908 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 67,994 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 77,908 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 59,032 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000
నెంబరు. 5	9000	15500
273	10000	14000
341	8000	17500
4884	11000	15500
సూపర్ 10	9000	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	19500
బ్యాడిగి	8500	16000
దేవనూరు డీలక్స్	9000	15000
తెల్లకాయలు	5000	11500


నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00


ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కుల కోసం, డా॥ అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కోసం
మీరు చేస్తున్న పోరాటం నభూతో నభవిష్యత్
ఓ మహాత్మా...
ఓ మహర్షి...
మీ సంకల్పం నిరుపమానం
మీ పోరాటం అపురూపం
మీ నాయకత్వం దేశానికే ఆదర్శం...
నిరంతర శ్రామికుడు, అవిశ్రాంత పోరాట యోధుడు
గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
జన్మదిన శుభాకాంక్షలు...
మీ
కనపర్తి శ్రీనివాసరావు
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు
నందిగామ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

తెనాలిలో మూడు నామినేషన్లు దాఖలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 19: తెనాలి అసెంబ్లీ నియోజకవర్గానికి శుక్రవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. జైభారత్ జాతీయ పార్టీ తరుపున అభ్యర్థిగా షేక్ బాషా నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు అందజేశారు. బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి కారుమంచి సునీల్ సందీప్ నామినేషన్ వేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా జింకా మల్లికార్జునరావు నామినేషన్ దాఖలు చేశారు.

ప్రజలందరి మన్ననలు పొందేలా పాలన చేస్తాం

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్



స్వామివారిని దర్శించుకుని వేద ఆశీస్సులు పొందుతున్న మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్ 19: శ్రీరామనవమి వేడుకల్లో రెండో భద్రాద్రిగా పేరుగాంచిన తెనాలిలో సంస్కృతి సంప్రదాయాలను మరింతగా ఇనుమడింపజేసి ప్రజలందరి మన్ననలు పొందేలా కూటమి ప్రభుత్వ పాలన సాగనుందని జనసేన పీఏసీ చైర్మన్, ఉమ్మడి పార్టీల తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని నెహ్రూరోడ్డులోని శ్రీసీతారామస్వామి వారి దేవస్థానంలో శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో నాదెండ్ల మనోహర్ పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని వడ్డించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మనోహర్‌ను ఆలయ అర్చకులు వేద ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ తెనాలి ప్రాంతానికి రెండో భద్రాద్రిగా మంచి పేరు ఉందన్నారు. తరతరాలుగా ఆ సంప్రదాయాన్ని కాపాడుకుంటూ వస్తున్న నిర్వాహక కమిటీ సభ్యులకు మనోహర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి పార్టీ అధికారం చేపట్టిన తరువాత ప్రజలందరి అభీష్టం మేరకు ఉత్సవాలను మరింత గొప్పగా నిర్వహించుకుంటూ భావితరాలకు సంస్కృతి సంప్రదాయాల గొప్పదనాన్ని ఎలుగెత్తిచాటుదామన్నారు. నిర్వాహక కమిటీ సభ్యులు, ఉమ్మడి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేశినేని శివనాథ్ గెలుపునకు కృషి చేస్తాం

● రాష్ట్ర వాణిజ్యవిభాగ అధికార ప్రతినిధి పూర్ణచంద్



కేశినేని శివనాథ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పూర్ణచంద్, జయలక్ష్మి, శ్రావణ్‌కుమార్ దంపతులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 19: విజయవాడ పార్లమెంట్ ఉమ్మడి పార్టీల (ఎన్డీఏ) అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) గెలుపునకు తామంతా కృషి చేస్తామని రాష్ట్ర వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి ఈదర వెంకటపూర్ణచంద్ చెప్పారు. శుక్రవారం విజయవాడలోని కేసినేని శివనాథ్ (చిన్ని)ను రాష్ట్ర వాణి జ్య విభాగ అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్, గుంటూరు పార్లమెంటరీ తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నాబత్తుని జయలక్ష్మి, శ్రావణ్‌కుమార్ దంపతులు కలిసి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉమ్మడి పార్టీల అభ్యర్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగిఉండాలి

● హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు నాగరాజు

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 19: ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగిఉండాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు అన్నారు. స్థానిక 11వ వార్డు పూలే కాలనీలో శుక్రవారం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు ఆధ్వర్యంలో నిరక్షరాశ్యులైన ప్రజలకు, యువతకు ఎన్నికల మీద, ఓటు హక్కు మీద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రజలు వారి ఓటు ద్వారా సమస్యల కోసం, రక్షణ కోసం, స్వేచ్ఛాయుత పరిపాలన కోసం, మంచి నాయకులను ఎన్నుకోవడానికి ఓటును ఆయుధంగా ఉపయోగించుకోవాలని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బడుగు బలహీనవర్గాల కోసం రాజ్యాంగాన్ని రాసి వజ్రాయుధం లాంటి ఓటు హక్కును ప్రజల కోసం కల్పించారన్నారు. రానున్న ఎన్నికలలో ప్రజలు ప్రలోభాలకు లోనుకాకుండా మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. ఓటు హక్కును వినియోగించుకొని తద్వారా దేశాభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధికి కృషిచేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యుడు ఎం.లిఖిత్, జె.శివం, కె.ఫణికుమార్, శ్రీను ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 19: పట్టణంలోని మార్కెట్ వంతెన వద్ద కృష్ణ రాజగోపాల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బాటసారులకు, చిరువ్యాపారులకు శుక్రవారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యుడు సాతులూరి శ్రీనివాస శేషసాయి మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఎండ వేడిమికి పాదచారులకు, చిరు వ్యాపారులకు దాహార్తిని తీర్చడానికి మజ్జిగ పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 19: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీమహాత్మా గాంధీ శాంతి ఆశ్రమంలో శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులకు అన్నదానం చేశారు. ఎస్వీ యోగా సభ్యులు ముద్రబోయిన మాణిక్యారావు, వందన దంపతుల కుమార్తె వైరా ద్వితీయ జన్మదినం సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్వీ యోగా కన్వీనర్ ముద్దాబత్తుని రమణయ్య పర్యవేక్షణలో కుటుంబరావు, కోటేశ్వరావు, ఆశ్రమ నిర్వాహకుడు వజ్రాల రామలింగాచారి, యోగా సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి

● ఏఈ నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
● వారికి మద్దతు తెలిపి, నిరసన తెలిపిన ధూళిపాళ్ల నరేంద్ర




లైన్‌మన్ రాజేష్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నరేంద్ర కుమార్, విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తున్న నరేంద్ర

పెదకాకాని, ఏప్రిల్ 19: విద్యుత్ మరమ్మతులు చేస్తూ అసిస్టెంట్ లైన్‌మన్ మృతి చెందిన ఘటన పెదకాకాని సబ్‌స్టేషన్‌లో శుక్రవారం జరిగింది. ఎన్టీఆర్ కాలనీ కాలనీ, జీపీఆర్ కాలనీ మధ్యలో వున్న 11 కేవీ లైన్ సప్లై లేదని కరెంట్ తీగ కట్ చేయాలని వెంకటకృష్ణాపురం సచివాలయం ఉద్యోగి, జేఎల్ఎం రాజేష్ (25)ని స్తంభం పైకి ఎక్కించారు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలంలోని రాజేష్ మృతిచెందాడు. రాజేష్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ రాజేష్ మృతదేహంతో ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పొన్నూరు నియోజకవర్గం తెలుగుదేశం జనసేన బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆందోళనలో పాల్గొన్నారు. సుమారు మూడు గంటలపాటు హైవేపై ఆందోళన చేశారు. రాజేష్ చనిపోవటానికి కారణం పెదకాకాని ఏఈ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. పెదకాకాని మండల విద్యుత్ శాఖ ఏఈ బత్తుల శ్రీనివాస్‌పై హత్యా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కుక్కల మల్లేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ బెజవాడ కృష్ణమూర్తి, తెలుగు యువత నాయకులు పెండ్యాల నాగసురేష్, మాజీ చైర్మన్ దర్శి భాస్కరరావు, వెంకటకృష్ణాపురం సర్పంచ్ ధూళిపాళ్ల వెంకటేశ్వరరావు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి

పెదకాకాని, ఏప్రిల్ 19: స్వాతంత్ర సమరయోధుడు, సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి పెదకాకానిలో శుక్రవారం నిర్వహించారు. పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, పెదకాకాని గౌడ సంఘం ఆధ్వర్యంలో లచ్చన్న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన స్వాతంత్ర ఉద్యమంలో అందించిన సేవలను కొనియాడారు. టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కుక్కల మల్లేశ్వరరావు, డాక్టర్ శివాజీ, ఆత్మకూరు వెంకటేశ్వర్లు, పూర్ణచంద్రరావు, ముద్రబోయిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారంకి లక్ష్మీనారాయణ, కుక్కల రాంప్రసాద్, బుర్ర అంకయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు అసెంబ్లీకి రెండు నామినేషన్లు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 19: పొన్నూరు అసెంబ్లీ ఎన్నికలకు రెండోరోజు శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి ఏ లక్ష్మీకుమారి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని ఆర్వోకు స్వతంత్ర అభ్యర్థిగా దొప్పలపూడి వాసుదేవరావు ఒక సెట్ నామినేషపత్రాలు అందజేశారు. అలాగే బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా యాతాటి కిషోర్ నామినేషన్ దాఖలు చేశారు.

అవినీతిరహిత పాలనకు పట్టంకట్టండి

● వార్డు పర్యటనలో నాదెండ్ల మనోహర్



మనోహర్‌కు హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

తెనాలి రూరల్, ఏప్రిల్ 19: రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ అవినీతి రహిత పాలనకు ఉమ్మడిగా పోటీచేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీల అభ్యర్థులను గెలిపించాలని జనసేన పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెలుగుజనచైతన్య పాదయాత్రలో భాగంగా శుక్రవారం ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి నాదెండ్ల మనోహర్ పట్టణంలోని 21, 22వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రానికి అమరావతి రాజధానిగా దినదినాభివృద్ధి చెందిందని, కియా మోటార్స్, అమర్‌రాజా వంటి పరిశ్రమలు రాష్ట్రంలోకి వచ్చాయన్నారు. రాజధాని అమరావతిగా ఉంటూ, కొత్తపరిశ్రమలతో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా ప్రణాళికతో ముందుకు వస్తున్న ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించాలని మనోహర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తొలుత వార్డు పర్యటనకు విచ్చేసిన మనోహర్‌ను ఉమ్మడి పార్టీల శ్రేణులు గజమాలలతో స్వాగతం పలకి మహిళలు హారతులు ఇచ్చి దిష్టితీసి స్వాగతం పలికారు. పలువురు ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మనోహరం, రాజ్యలక్ష్మిల ఇంటింటి ప్రచారం

గ్రామాల్లో అభివృద్ధి ఉమ్మడి పార్టీలతోనే సాధ్యమని జనసేన పీఏసీ చైర్మన్, ఉమ్మడి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సతీమణి, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సోదరి రాజ్యలక్ష్మిలు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని కొలకలూరులో టీడీపీ,జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థులుగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్,పెమ్మసాని చంద్రశేఖర్‌లను గెలిపించాలని కోరుతూ నాదెండ్ల మనోహరం, పెమ్మసాని రాజ్యలక్ష్మి, ఉమ్మడి పార్టీల శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారానికి గ్రామానికి విచ్చేసిన మనోహరంను గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి దుశాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే అతిసార

మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



డయేరియా బాధితులను పరామరిస్తున్న నరేంద్ర కుమార్

చేబ్రోలు, ఏప్రిల్ 19: అధికారుల నిర్లక్ష్యంతోనే మంచాల గ్రామంలో కలుషిత నీరు తాగి ప్రజలు డయేరియా బారిన పడ్డారని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపించారు. శుక్రవారం మంచాల గ్రామానికి సందర్శించిన నరేంద్ర కుమార్ ఇంటింటికి వెళ్లి అతిసార బాధితులను పరామర్శించి వైద్యం అందుతున్న తీరుపై ఆరా తీసారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గ్రామంలో వేసవిలో వ్యాధులు ప్రబలుతాయని తెలిసినప్పటికీ అధికారులు సరైన చర్యలు పాటించలేదని ఆరోపించారు. వ్యాధి ప్రబలిన తర్వాత రెండు రోజులు పాటు వైద్యాధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బాధితులందరికీ నైణ్యమైన వైద్యం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నరేంద్ర కుమార్ డిమాండ్ చేసారు. కార్యక్రమంలో గ్రామస్థులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సంస్కృత భాషపై ఉచిత శిక్షణ తరగతులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 19: వైఖానస సేవా సంఘం ఆధ్వర్యంలో సంస్కృత భాషపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామని సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థులు తెలిపారు. శుక్రవారం శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. కోటా లక్ష్మయ్య నాయుడు కళాశాల విద్యార్థుల సహకారంతో గంగానమ్మపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శిక్షణ జరుగుతుందన్నారు. ఈ నెల 25నుంచి నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హిందూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ దీక్షితులు, సంస్కృత పండితులు ఎ.శ్రీనివాస్‌శర్మ శిక్షణ ఇస్తారని చెప్పారు. ఈవో మల్లేశ్వరి పర్యవేక్షణలో జరిగే శిక్షణను విజయవంతం చేయాలని మురళీకృష్ణ, శ్రీనివాసమూర్తి, వినాయకరావు, రామలింగేశ్వరరావు, రఘు కోరారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న రైల్వే ఉన్నతాధికారులు

అభివృద్ధి పనులను పరిశీలించిన రైల్వేఅధికారులు

తెనాలి క్రైం, ఏప్రిల్ 19: తెనాలి రైల్వే స్టేషన్‌లో రైల్వే బోర్డు మెంబర్ అనిల్‌కుమార్ ఖండవాల్ బృందం పరిశీలించారు. ఈ సందర్భంలో స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రయాణికుల భద్రత గురించి సూచనలు చేశారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ రమణ, సిటిపిఎం పద్మజ, బెజవాడ డిఆర్ఎం నరేంద్ర, ఎ.పాటిల్, చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

● సహాయ మలేరియా అధికారి ప్రభాకర్‌రెడ్డి

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 19: పట్టణ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి కోరారు. స్థానిక సుల్తానాబాదు సచివాలయం పరిధిలో శుక్రవారం మలేరియా, ఫైలేరియా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఆరోగ్య సిబ్బంది, సచివాలయ శానిటరీ సెక్రటరీలు సంయుక్తంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. సిబ్బందితో ఫ్రైడే డ్రైడే అవగాహన పత్రాలను పంపిణీ చేస్తూ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యధాకారి కారుమూరు హెలెన్ నిర్మల, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, యూయల్‌బీ విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఫైలేరియా సీనియర్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు బండారు మల్లేశ్వరావు, టి.శివరామప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు షేక్ నవీద్, షేక్ రషీద్, నగర దీపికలు, ఆషా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

తెనాలి క్రైం, ఏప్రిల్ 19: ఇటీవల బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షునిగా ఎన్నుకోబడిన బేతాళ ప్రభాకర్‌ను శుక్రవారం పట్టణంలోని భరత్‌కుమార్ స్వచ్ఛంద సేవా సంస్థ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పాముల కృష్ణ, కిషోర్‌బాబు, కంచర్ల నరేష్, బండి రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలు: కలెక్టర్



మంచాల ఆరోగ్య శిబిరంలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఏప్రిల్ 19: మంచాల గ్రామంలో అతిసార లక్షణాలతో అనారోగ్యానికి గురైన బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మంచాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి, సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్ సందర్శించారు. చికిత్స పొందుతున్న అనారోగ్య బాధితులను పరామర్శించి అందుతున్న వైద్య సేవలను ఆరాతీశారు. 50 మంది వాంతులు, విరోచనాలతో అనారోగ్యానికి గురయ్యారని గుర్తించినట్లు వైద్య సిబ్బంది కలెక్టర్‌కు తెలిపారు. ఎక్కువ లక్షణాలున్న ఇద్దరిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి, మరో ఇద్దరిని వడ్లమూడి డీవీసీ హాస్పటల్‌కు తరలించినట్లు చెప్పారు. ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. 10 మంది మాత్రమే వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. అయితే శ్రీరామ నవమి వేడుకలో పానకాన్ని నిల్వ వుంచుకొని తాగడం వల్ల అనారోగ్యానికి గురైనట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ పానకం శ్యాంపిల్స్ గ్రామానికి సరఫరా అవుతున్న నీటి శ్యాంపిల్స్‌ను పరీక్షలకు పంపాలని ఆదేశించారు. అంబులెన్స్‌లు గ్రామంలో అందుబాటులో ఉంచాలని, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో 30పడకలు, పొన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డులను సిద్ధం చేసినట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయ లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఎస్ఈ సురేష్, ఫుడ్ కంట్రోలర్ రవీందర్ రెడ్డి, డిపిఎంవో డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, తహశీల్దార్ రమాదేవి, ఎంపీడీవో జ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న 33 లారీలు సీజ్




పోలీసు స్టేషన్‌కు తరలించిన ఇసుక లారీలు, పోలీసులు సీజ్ చేసిన పొక్లెయిన్

కొల్లిపర, ఏప్రిల్ 19: కృష్ణానది ఇసుక రీచ్‌ల్లో అనధికారంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని సమాచారం రావటంతో తెనాలి డీఎస్పీ రమేష్ ఆదేశాల మేరకు గురువారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు ఇసుక రీచ్‌ల్లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో మండలంలోని అన్నవరం ఇసుకరీచ్‌లో 33 ఇసుకలారీలతో పాటు, రెండు జేసీబీలను సీజ్ చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రవీంద్రరెడ్డి శుక్రవారం తెలిపారు.

సూపర్ - 6తో పేదల భవిష్యత్తుకు గ్యారంటీ: ధూళిపాళ్ళ



జనసేన టీడీపీ మహిళలతో నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 19: టీడీపీ మేనిఫెస్టో సూపర్ - 6తో పేదల భవిష్యత్తుకు గ్యారంటీ లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని 1వ వార్డులో శుక్రవారం నరేంద్రకుమార్ టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోకి వచ్చిన నరేంద్రకుమార్‌కి, జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబుకి మహిళలు మంగళహారతులు పట్టారు. రానున్న ఎన్నికలో కూటమి అభ్యర్థు లైన తనను, ఎంపీగా పెమ్మసాని చంద్రశేఖర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

● పట్టణంలోని 8వ వార్డు ఎస్టీ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం నరేంద్రకుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నిడుబ్రోలు అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్, నిలా జ్ఞాన సుందరరావు, పొన్నగంటి వాసు, గర్నెపూడి వాసు, అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల విషయంలో అప్రమత్తత అవసరం

తెనాలి క్రైం, ఏప్రిల్ 19: అగ్నిప్రమాదం జరిగినపుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చేపట్టవలసిన చర్యల గురించి రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ అధికారులు శుక్రవారం పట్టణంలోని హాస్పటల్స్, కూడళ్ళలోను అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా వంట గదుల్లోను, ఎలక్ట్రికల్ పరికరాల, ఆసుపత్రి, హోటల్స్, ఇండస్ట్రీలో జరిగే ప్రమాదాల గురించి వాటిపై తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అధునాతన అగ్నిమాపక యంత్ర పరికరాల గురించి వాటి పనితీరు గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక జిల్లా అధికారి కె.కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రిలో అవగాహన

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 19: అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో అప్రమత్తంగా వ్యవహరించటంతో రోగుల ప్రాణాలు కాపాడవచ్చని ఫైర్ అధికారి కె.ప్రసాదరావు తెలిపారు. పట్టణంలోని హాస్పిటల్స్‌లో శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. అనుకోని ప్రమాదాలు జరిగితే మంటలను అదుపు చేసే పద్ధతులతోపాటు రోగులను తరలించే పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ గెలుపుతోనే పేదలందరికీ మేలు: ఎమ్మెల్యే అన్నాబత్తుని

కొల్లిపర, ఏప్రిల్ 18: వైసీపీ గెలుపుతోనే పేదప్రజలందరికీ మేలు జరుగుతుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే శివకుమార్ స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రోడ్‌షోలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, వైసీపీ కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, సర్పంచ్ వేమూరి దీనమ్మ, ఉపసర్పంచ్ ఆళ్ళ శివనాగిరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు కల్లం వెంకటప్పారెడ్డి, నాయకులు ఆరిగ చంద్రశేఖర్‌రెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

24 మంది దంపతుల షష్టిపూర్తి మహోత్సవం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 19: బోసురోడ్డులోని వాసవీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం 24 మంది దంపతుల షష్టిపూర్తి మహోత్సవం జరుపుకున్నారు. పిల్లి వెంకటమోహన్ శ్రీనివాస్, పద్మజ దంపతులు షష్టి పూర్తి సందర్భంగా తనతో పాటు మరిన్ని పేద కుటుంబాలకు షష్టి పూర్తి చేసుకునే అవకాశం కల్పించారు. అందరూ కలిసి శాస్త్రోక్తంగా షష్టిపూర్తి ఉత్సవం జరుపుకున్నారు. దంపతులందరికీ నూతన వస్త్రాలు బహుకరించారు. లోక కల్యాణం కోసం ఆయుష్య హోమం, మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఆర్య వైశ్య సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

లోకేశ్‌పై ఆరోపణలు వైసీపీ దిగజారుడికి నిదర్శనం

● ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించిన టీడీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 19: ఎక్కడో ఏదో జరిగితే నారా లోకేశ్‌పై ఆరోపణలు చేయడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమని తాడేపల్లి నాయకులు మండిపడ్డారు. లోకేశ్‌ను అరెస్టు చేయాలన్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పట్టణ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి శవరాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. దాడి చేస్తారన్న భయంతో వాహనదారులు వైసీపీ కార్యకర్త వెంకటరెడ్డిని ఢీకొట్టారని, ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడడం దురదృష్టకరమని త్వరగా కోలుకోవాలని అన్నారు. టీడీపీ సానుభూతిపరులు ఈ ఘటనకు కారకులు అంటూ వైసీపీ నాయకులు ప్రచారం చేయడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ఫేక్ ప్రచారాలు, తప్పుడు ఆరోపణలు చేయడం వైసీపీ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. ప్రశాంతంగా ఉన్న తాడేపల్లి ప్రజల మధ్య చిచ్చుపెట్టి వైసీపీ నాయకులు శునకానందం పొందుతున్నారని విమర్శించారు. తాడేపల్లిలో రెండు గ్రూపులు ఆధిపత్యం కోసం కొట్టుకుంటున్నాయని, గ్రూపు రాజకీయాలకే వెంకటరెడ్డి బలి అయ్యారని అన్నారు. రోడ్డుపై వెళ్లే వాహనదారులను అడ్డుకుని భయభ్రాంతులకు గురి చేస్తే దాడి చేస్తారనే భయంతోనే వాహనదారులు యాదృచ్ఛికంగానే వెంకటరెడ్డి ఢీకొన్నారన్నారు. పదే పదే నారా లోకేశ్‌పై బురద జల్లే కార్యక్రమాలు వైసీపీ చేపట్టడం సమంజసం కాదన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని కోరారు. పట్టణ టీడీపీ నాయకులు దొంతిరెడ్డి సాంబిరెడ్డి, కళ్లం బాపిరెడ్డి, మేకా పుల్లారెడ్డి, మేకా శ్రీధర్‌రెడ్డి, దొంతిరెడ్డి మధు, బుర్రముక్కు రాజేశ్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న జీవితం ఆదర్శప్రాయం



గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 19: సర్దార్ గౌతు లచ్చన్న పోరాట జీవితం ఎందరికో ఆదర్శప్రాయమని టీడీపీ నేతలు పేర్కొన్నారు. గౌతు లచ్చన్న వర్ధంతిని పురస్కరించుకుని మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం లచ్చన్న నిరంతరం పోరాటం చేశారన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సామాజికవేత్తగా ఆయన నాయకత్వం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు వాకా మాధవరావు, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేఖా సుధాకర్‌గౌడ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కారంపూడి అంకమ్మరావు, నేతలు తోట పార్థసారధి, గోవాడ దుర్గారావు, కొమ్మా సుకుమార్, షేక్ రియాజ్, మల్లవరపు వెంకట్రావు, అన్నం నాగబాబు, మున్నంగి శివశేషగిరిరావు, పందేటి తిరుపతయ్య, బట్టు చిదానంద శాస్త్రి, జొన్నాదుల బాలకృష్ణ, వాకా మంగారావు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల వేళ భారీగా మద్యం స్వాధీనం

● 320 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలై నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండగా మంగళగిరిలో భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నారు.. వైసీపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న మద్యం దుకాణంలో సేల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్న వ్యక్తి వక్ర మార్గంలో మద్యం బాటిళ్లను నిల్వచేసి అక్రమంగా విక్రయిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. మంగళగిరి ఎస్‌ఈబీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎల్ రంగారెడ్డి నిందితుడి వివరాలను వెల్లడించారు. మంగళగిరి మండలం కాజ గ్రామానికి చెందిన కుర్రె దామోదర్‌రెడ్డి అదే గ్రామంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మ్యాన్‌గా పని చేస్తున్నాడు. షాపులోని మద్యం సరుకును ఎమ్మార్పీ ధరలకు స్కానింగ్ చేసి తన నివాసానికి తరలించి భారీగా నిల్వ చేశాడు. నిల్వచేసిన మద్యం బాటిళ్లను వైన్‌షాపులు మూసివేసిన తరువాత అదనపు ధరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్న ఎస్‌ఈబీ అధికారులకు ఈ విషయం తెలియడంతో గురువారం అర్ధరాత్రి దామోదర్‌రెడ్డి నివాసంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వివిధ బ్రాండ్లకు చెందిన రూ.60 వేల విలువ చేసే 320 డ్యూటీ పెయిడ్ క్వార్టర్ మద్యం బాటిళ్లు ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఉద్యోగం నుంచి తొలగించి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి, మంగళగిరి ఎస్‌ఈబీ సీఐ పీ ప్రసన్నలక్ష్మీ, ఎస్ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా వ్యవహరిస్తే నష్ట నివారణ

మంగళగిరి, ఏప్రిల్ 19: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తే నష్టం తీవ్రతను తగ్గించేందుకు వీలు కలుగుతుందని మంగళగిరి అగ్నిమాపక దళాధికారి వై వెంకటేశ్వర్లు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రి, చినకాకాని ఎన్నారై ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత భక్తి విభావరి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 19: స్థానిక కొరిటెపాడు గాంధీ బొమ్మ సెంటర్ శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామ నవమి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ, కోదండ రాముడికి పంచామృతాలతో అభిషేకం, అర్చన, అలంకార పూజ కార్యక్రమాలను పండితులు నిర్వహించారు.

నిబంధనలు బేఖాతర్

● వైసీపీ నామినేషన్ ర్యాలీలో కోడ్ ఉల్లంఘనలు
● ఆర్వో కార్యాలయం వద్ద వైసీపీ కార్యకర్తల హల్‌చల్
● ఆ సమయంలో కానరాని పోలీసు అధికారులు
● ఆర్టీసీ బస్సెక్కి అడ్డగోలుగా చిందులు
● ట్రాఫిక్ రద్దీలో చిక్కుకున్న అంబులెన్స్



ర్యాలీలో భాగంగా ఆర్టీసీ బస్సుపైకి ఎక్కి చిందులేస్తున్న వైసీపీ కార్యకర్తలు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 19: వైసీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య నామినేషన్ ర్యాలీలో అడుగడుగునా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరిగాయి. ఎంటీఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చుట్టూ వంద మీటర్ల లోపు బారికేడ్లు ఏర్పాటు చేసి బయటి వ్యక్తులు రాకుండా నిబంధనలను అమలు చేశారు. తొలిరోజు గురువారం టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ నామినేషన్ సందర్భంగా ఈ నిబంధనలను కఠినంగా అమలు చేసిన పోలీసు యంత్రాంగం.. రెండో



గౌతమబుద్ధ రోడ్డుపై ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

రోజైన శుక్రవారం అధికార పార్టీ అభ్యర్థి నామినేషన్‌లో మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరించింది. వంద మీటర్ల లోపు మీడియాపై సైతం ఆంక్షలు విధించిన పోలీసులు.. వైసీపీ కార్యకర్తలకు మాత్రం విచ్చలవిడిగా అనుమతి ఇచ్చారు. లావణ్య రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, ఆమె తరపున పది మందిని, మురుగుడు సత్యం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడంతో ఆయన తరపున మరో ఐదుగుర్ని కలిపి మొత్తం 15 మందిని ఆర్వో కార్యాలయంలోనికి అనుమతించారు. అనంతరం అప్పటి వరకు అక్కడే విధులు నిర్వర్తించిన పోలీసు ఉన్నతాధికారులు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో.. వైసీపీ నేతలు, కార్యకర్తలు ఒక్కొక్కరుగా వంద మీటర్ల హద్దును దాటుకుని ఆర్వో కార్యాలయం వద్దకు చేరుకుని హల్‌చల్ చేశారు. అధికార పార్టీకి అనుకూలంగా ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. అంతకు ముందు వైసీపీ అభ్యర్థికి మద్దతుగా పట్టణంలో నిర్వహించిన ర్యాలీ ప్రజలకు చికాకు తెప్పించింది. హారన్లు, సైరన్లు, బుల్లెట్ షాట్లతో వైసీపీ కార్యకర్తలు హంగామా సృష్టించారు. మెయిన్ బజారు, గౌతమబుద్ధ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. వైసీపీ కార్యకర్తలు ఆర్టీసీ బస్సు పైకెక్కి చిందులేశారు. ట్రాఫిక్ రద్దీలో అత్యవసరంగా వెళుతున్న ఓ అంబులెన్స్ చిక్కుకుపోయింది.

కూటమి ప్రభంజనంలో వైసీపీ తుడిచిపెట్టుకుపోతుంది

గుంటూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్



సమావేశంలో పాల్గొన్న పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి శ్రావణ్‌కుమార్, గాదె వెంకటేశ్వరరావు, కంతేటి బ్రహ్మయ్య

తాడికొండ, ఏప్రిల్ 19: కూటమి ప్రభంజనంలో వైసీపీ పూర్తిగా తుడిచి పెట్టుకుపోతుందని గుంటూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం తాడికొండ నియోజకవర్గం కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మీడియా సమావేశంలో కూటమి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ రాష్ట్రంలో 5 సంవత్సరాల్లో జరిగిన అణచివేతకు, అరాచకాలకు, విధ్వంసానికి నేటి శ్రావణ్‌కుమార్ నామినేషన్‌తో చివరి రోజు అన్నారు. నామినేషన్‌కు వచ్చిన ప్రజాదరణ చూస్తుంటే మార్పు మొదలైందన్నారు. ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. మూడు కిలోమీటర్ల మేరకు ఇసుకవేస్తే రాలనంత మంది ప్రజలు వచ్చారన్నారు. నామినేషన్‌కు వేయటానికి వస్తున్న క్రమంలో ర్యాలీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిక్కుకుపోతే మావాళ్లు వెళ్లి తీసుకువచ్చారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు త్వరలోనే వైసీపీ ప్రభుత్వం నుంచి విముక్తి దొరుకుందన్నారు. అసత్య ప్రచారాలతో వైసీపీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. మూడు రాజధానుల పేరుతో రాజధాని అమరావతిని అభివృద్ధి చేయకుండా గాలికొదిలేశారన్నారు. జగన్ సీఎం అయితే వైజాగ్‌లో ప్రమాణ స్వీకారం చేస్తామని ప్రకటించం సిగ్గు చేటన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జూన్ 4న వచ్చే ఫలితాల్లో రాష్ట్రంలో కూటమి అభ్యర్థులకు అత్యధిక మెజారిటీ వస్తుందన్నారు. శ్రావణ్‌కుమార్ నామినేషన్ చూస్తే ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టంగా కన్పిస్తుందన్నారు. చేతకాని వ్యాపారి చేతిలో రాష్ట్రాన్ని పెడితే ఎలా నాశనం అవుతుందో నిదర్శనం ఈ ఐదు సంవత్సరాల పాలన అన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంతేటి బ్రహ్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ దుర్మార్గమైన పాలనకు ప్రజలు బలైపోయారన్నారు. 10 రోజుల నుంచి చూస్తే వైసీపీని వీడి చాలా మంది నేతలు టీడీపీలోకి క్యూ కడుతున్నారన్నారు. ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌కు ఓట్లు వేసి గెలిపించాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కంచర్ల శివరామయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడేపల్లి, ఏప్రిల్ 19: తాడేపల్లి పరిధిలోని సెటిల్‌మెంట్ కాలనీ, సుందరయ్యనగర్ కట్ట ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అక్కల సత్యనారాయణ తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

463 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, ఏప్రిల్ 19: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 463 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.12,875 గరిష్ఠధర రూ.14,100 మోడల్‌ధర రూ.13,800 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.12,875 గరిష్ఠ రూ.14,100, మోడల్‌ధర రూ.14,100 పలికాయి.

పశ్చిమడెల్టాకు 916 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఏప్రిల్ 19: కృష్ణాపశ్చిమ డెల్టాకు 916 క్యూసెక్కుల నీటిని శుక్రవారం విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజీవద్ద 7.2 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వ 194 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 250 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

రెండో రోజు ఆరు నామినేషన్లు దాఖలు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 19: నామినేషన్ల పర్వంలో భాగంగా రెండో రోజైన శుక్రవారం మంగళగిరి అసెంబ్లీ స్థానానికి సంబంధించి ఐదుగురు అభ్యర్థుల నుంచి ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున వెంకట నాగలక్ష్మి, స్వతంత్ర అభ్యర్థిగా దివ్వెల కనక దుర్గ, వైసీపీ తరపున మురుగుడు లావణ్య రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా మురుగుడు సత్యం, మరో స్వతంత్ర అభ్యర్థిగా అక్కిశెట్టి శ్రీకృష్ణ నామినేషన్లు సమర్పించారు. ఎంటీఎంసీ కార్యాలయంలో మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. తొలుత వైసీపీ అభ్యర్థి లావణ్య పాతమంగళగిరి సీతారామ స్వామి కోవెలలో ప్రత్యేక పూజలు నిర్వహించి పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా ఎంటీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

పాఠశాలల మ్యాపింగ్ పూర్తి చేయాలి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 19: విద్యార్థులు ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి పూర్తి చేసి ఉన్నత పాఠశాలల్లో చేరేందుకు వీలుగా పాఠశాలల మ్యాపింగ్ చేయాలని ఉర్దూ డీఐ ఎస్‌కేఎండీ ఖాసిం సూచించారు. శారదాకాలనీలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు.

బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తెస్తున్నాం : గళ్లా మాధవి



నల్లచెరువు ఆలయంలో పూజలు చేసి ప్రచారం కొనసాగించిన గళ్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంరక్షణ కోసం ప్రత్యేక బీసీ రక్షణ చట్టాన్ని తీసుకువస్తున్నమని టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గళ్లా మాధవి చెప్పారు. గుంటూరు 19వ డివిజన్ నల్లచెరువులో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అధికంగా బీసీల మీద దాడులు జరిగాయని, ఇటువంటి కక్ష సాధింపుదారుల నుంచి బీసీలకు చట్టపరంగా రక్షణ కల్పించడం కోసం టీడీపీ అధినేత నారా చంద్రబాబు నేతృత్వంలో ప్రత్యేక రక్షణ చట్టం తెస్తున్నామని చెప్పారు. ఆనాడే రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బీసీలను ముందుకు తీసుకొచ్చి చదువుకున్న బీసీ యువకులను ఎమ్మెల్యేలు, మంత్రులుగా చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. బీసీలకు స్థానిక సంస్థలలో చంద్రబాబు 34శాతం రిజర్వేషన్ కల్పిస్తే దాన్ని ఈ ప్రభుత్వం 24శాతానికి తగ్గించి 10శాతం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్‌రెడ్డి అవకాశాన్ని కోతపెట్టాడని విమర్శించారు. నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనారిటీలు అని అంటున్న జగన్‌రెడ్డి ప్రభుత్వం, గత టీడీపీ ప్రభుత్వంలో బలహీన వర్గాల కోసం తీసుకొచ్చిన కార్యక్రమాలు ఏమైనా ఈనాడు కొనసాగిస్తున్నారా? బటన్ నొక్కుడు కార్యక్రమం తప్పించి చేసిందేమీ లేదన్నారు. కార్పొరేషన్లను నామమాత్రం చేసి కులాలను విభజించాడని ఆరోపించారు. బీసీల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ చేసే బాధ్యత కూడా ఈ ప్రభుత్వం తీసుకోలేదన్నారు. గత ప్రభుత్వంలో ఆదరణ పథకం ద్వారా కులవృత్తులు చేసుకునే వారికై తీసుకొచ్చిన పనిముట్లను గతంలో కొన్ని పంపిణీ చేయగా ప్రస్తుతం గోడౌన్‌లో మగ్గుతూ నాలుగున్నరేళ్ళుగా తుప్పు పడుతున్నాయని వాటిని ఇచ్చే ప్రయత్నం జగన్‌రెడ్డి చేయలేదని విమర్శించారు. విదేశీ విద్య పథకానికి రూపాయి కూడా ఇవ్వకుండా విదేశాల్లో చదువుకునే అవకాశాన్ని బీసీలకు లేకుండా చేశారన్నారు. దాదాపు 75 మంది బీసీలను ఊచకోత కోశారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీ ద్రోహి వైసీపీకి బుద్ధి చెప్పాలని మాధవి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాళ్లబండి రామరాజు, లక్ష్మణ్ హేమంత్ కుమార్,బద్రి, చంద్రగిరి బాబు, అబ్దుల్ రహీం, సభాపతి విజయలక్ష్మి పరిమి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి వీవోఏల భజన

● వాట్సాప్ గ్రూపులలో పార్టీకి మద్దతుగా ప్రచారం



సిద్ధం సభకు వెళ్లే బస్సులో మహిళలను ఎక్కిస్తున్న వీవోఏ



వాట్సాప్ గ్రూపులో వైసీపీ ప్రచారం చేస్తున్న వీవోఏ

పెదనందిపాడు, ఏప్రిల్ 19: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి డ్వాక్రా సంఘాల వీవోఏల భజన బాగా పెరిగి పోయింది. పార్టీ కార్యక్రమాల్లో ఎక్కడా కూడా వీరి పాత్ర ఉండకూడదు. కాని గ్రామాల్లో వీరి హవా ఎక్కువగా ఉంటోంది. వైసీపీ ఇచ్చిన తాయిళాలు తీసుకున్న కొందరు వీవోఏలు ఆ పార్టీ కోసం పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన జగన్ సిద్ధం సభకు పెట్టిన బస్సులలో మహిళలను ఎక్కించే పనితో పాటు డ్వాక్రా గ్రూపుల్లో వైసీపీకి సంబంధించిన మెసేజ్‌లు షేర్ చేస్తున్నారు. వీవోఏల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

భావి తరాల భవిష్యత్తుకు బాబు భరోసా

● తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్

గుంటూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): భావి తరాల భవిష్యత్తుకు బాబే భరోసా అని తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ప్రారంభించిన ప్రజా దీవెన పాదయాత్ర శుక్రవారం గుంటూరు 2వ డివిజన్ ఇజ్రాయిల్ పేట, వెంకట్రావుపేట, రాజు హోటల్ సెంటర్ మీదగా సాగింది. టీడీపీ- జనసేన- బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి నసీర్ ముందుకు సాగారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ చేతకాని పాలనతో ప్రజలకు ప్రజలు అనేక కష్టాలను అనుభవిస్తున్నారని, సీఎం జగన్మోహన్ రెడ్డి అసమర్థత, ఎమ్మెల్యే ముస్తఫా చేసిన దోపిడీలు అరాచకాలను నియోజకవర్గ ప్రజలు ఓటు వేసే ముందు గుర్తు చేసుకోవాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధి, భావితరాల భవిష్యత్తు కావాలంటే దోపిడీ, దౌర్జన్యాలతో విర్రవీగుతున్న ఈ రాక్షస వైసీపీ నాయకులకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధి చెంది భావితరాల భవిష్యత్తు ఉంటుందని, చంద్రబాబు సీఎం అయితే సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగలుగుతారని చెప్పారు. వైసీపీ ఎమ్మెల్యే ఏనాడో ప్రజలను గాలికి వదిలేశాడని ఇప్పుడు తనకు ఓట్లు రావని తెలిసి కూతురికి టికెట్ తెచ్చుకొని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నా డని, ప్రజలు ఆయన మాట నమ్మే పరిస్థితి లేదని అన్నారు. తనకు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు జబి, అన్వర్, కార్పొరేటర్ సమత, జనసేన నాయకులు మహంకాళి శ్రీను, నాని తదితరులు పాల్గొన్నారు.

నేడు చంద్రబాబు జన్మదిన వేడుకలు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 19: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించనున్నట్టు నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త నందం అబద్దయ్య, పట్టణ, మండల అధ్యక్షులు దామర్ల రాజు, తోట పార్థసారధి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అనంతరం అబద్దయ్య ఆధ్వర్యాన ఎమ్మెస్సెస్ భవన్‌లో కేక్ కటింగ్, షేక్ రియాజ్ ఆధ్వర్యంలో పాతబస్టాండు సెంటరులో కేకు కటింగ్, శ్రీకృష్ణ చైతన్య వృద్ధుల ఆశ్రమం, షారోను శరణాలయంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు జరుగుతాయని తెలిపారు. పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

మంగళగిరి ప్రజలకు లోకేశ్ కృతజ్ఞతలు

మంగళగిరి, ఏప్రిల్ 19: మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థిగా తన తరపున నామినేషన్ దాఖలు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నియోజకవర్గ ప్రజలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తన నామినేషన్ కార్యక్రమానికి ప్రజలే సారధులుగా నిలిచి ముందుండి నడిపించడం గొప్ప అనుభూతిని కలిగించిందన్నారు. మండుటెండలో సైతం వేల సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడం కొండంత బలాన్నిచ్చిందని, కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మంగళగిరిని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దాలన్న తన సంకల్పానికి రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలవాలని లోకేశ్ ఆకాంక్షించారు.

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్‌కు తరలిన జనం



తుళ్లూరు నుంచి తెనాలి శ్రావణ్‌కుమార్ నామినేషన్‌కు కదలిన యువత

తుళ్లూరు, ఏప్రిల్ 19: జనసేన, బీజేపీ బలపరిచిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ నామినేషన్‌కు ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలు శుక్రవారం నియోజకవర్గ కేంద్రం తాడికొండకు తుళ్లూరు మండలం నుంచి పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. మహిళలు ఎండను సైతం లెక్క చేయకుండా పాల్గొన్నారు. తాడికొండ అడ్డరోడ్డు నుంచి గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌లు ప్రచార రథంపై కదలగా, ముందు మహిళలు పాదయాత్ర చేసుకుంటూ తాడికొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు వచ్చారు.

రాజీనామాలు చేసి ప్రచారాల్లో పాల్గొనండి

● వలంటీర్‌లపై వైసీపీ నేతల ఒత్తిళ్లు
● రాజీనామాలు చేసిన 23 మంది వలంటీర్లు



ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

పెదనందిపాడు, ఏప్రిల్ 19: రాజీనామాలు చేసి ప్రచారాల్లో పాల్గొనాలంటూ వైసీపీ నేతల హుకుం జారీచేయడంతో పాటు అధికారుల ఒత్తిళ్లతో మండలంలో వలంటీర్ల రాజీనామాలు పర్వం కొనసాగుతూనే ఉంది. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాల వలంటీర్లు శుక్రవారం రాజీనామా పత్రాలను ఎంపీడీవో సునీతాశర్మకు అందజేశారు. వలంటీర్‌లను వైసీపీ నాయకులు తమ ఇళ్ళ వద్దకు పిలిపించుకొని మరీ రాజీనామాలు చేయాలని, రాని వారికి నాయకులే స్వయంగా రాజీనామా పత్రాలు తయారు చేసి ఇంటికి పంపి సంతకాలు చేసి ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. కొంతమంది తాము ఎందుకు రాజీనామాలు చేయాలంటూ, దీంతో తమకు ప్రయోజనమేమిటని నేతలను ప్రశ్నిస్తున్నారు. పెదనందిపాడులో 7, నాగులపాడులో 6, అన్నవరంలో 10 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు.

తాగునీటి కోసం ఆందోళన

● పది రోజులుగా చుక్క నీరు రాక కాలనీవాసుల ఇబ్బందులు
● అధికారుల చుట్టూ తిరిగినా స్పందించని తీరు



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మాహబూబ్‌నగర్ కాలనీ వాసులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 19: పది రోజులుగా చుక్క నీరు ఇవ్వకుండా తామెలా బతికేదంటూ ప్రత్తిపాడు మహబూబ్‌నగర్ కాలనీకి చెందిన మహిళలు పంచాయతీ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. రెండు రోజులుగా తమ కాలనీకి నీటి సరఫరా చేయాలంటూ ప్రత్తిపాడు పంచాయతీ అధికారులను వేడుకున్నామన్నారు. అయినా ఇంత వరకు చుక్క నీరు ఇవ్వలేదని వారు ఆరోపించారు. సుమారు ఆరు గంటల సమయంలో పంచాయతీ వద్దకు మహిళలు ఖాళీ బిందెలతో చేరుకున్నారు. పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో అక్కడే గుంటూరు పర్చూరు ప్రధాన రహదారిపై బైఠాయించారు. చెరువుకు నీరు వచ్చినా తమ కాలనీకి నీరు ఎందుకు ఇవ్వడం లేదంటూ ప్రశ్నించారు. అయితే అంతలో అక్కడికి వచ్చిన పోలీసులు ఆందోళన చేస్తున్న మహిళలను పక్కకు తీసుకొచ్చారు. ఎస్ఐ సోమేశ్వరరావు పంచాయతీ సెక్రటరీతో మాట్లాడారు. వెంటనే మీ కాలనీకి నీరు విడుదల చేస్తారని మాట ఇవ్వడంతో మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

వైసీపీని ఓడిద్దాం.. అమరావతిని నిర్మిద్దాం

● డీబీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు



మేళం భాగ్యారావు

ఫిరంగిపురం, ఏప్రిల్ 19: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని ఓడించి అమరావతిని నిర్మించాల్సిన అవసరం ఉందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు అన్నారు. శుక్రవారం ఫిరంగిపురం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో దళిత బహుజనులకు తీరని ద్రోహం జరిగిందన్నారు. వారికి 27 పథకాలు రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు నవరత్నాలకు మళ్ళించిన ఘనత జగన్‌రెడ్డిదేనన్నారు. కనుకనే జగన్‌కు దళితులకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. జగన్ వేసే బిక్ష కాదు, సంక్షేమ పథకాలు పొందటం ప్రజల హక్కు అన్నారు. ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును విదేశీ విద్యకు తొలగించి జగన్ పేరు పెట్టుకోవటం శోచనీయం అన్నారు. చెత్తపై పన్ను వేసిన చెత్త ముఖ్యమంత్రి జగన్ అన్నారు. జగన్ ద్రోహాలను దేవుడు కూడా క్షమించడని ఆయన తెలిపారు. విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసి దారుణానికి తెగబడ్డారని ఆయన చెప్పారు. పూలింగ్ పద్ధతిలో 34వేల ఎకరాల భూమి 29వేల మంది రైతులు రాష్ట్రం కోసం ఇచ్చారన్నారు. తాడేపల్లిలోనే ఇల్లు కట్టుకుంటున్నానని అబద్దాలు చెప్పి రాజధాని అమరావతిలోనే ఉండాలని చెప్పిన జగన్ మాట తప్పి మడిమ తిప్పి మూడు రాజధానులంటూ రాష్ట్రానికి అధోగతి పాలు చేశారన్నారు. అమరావతిలో భూకుంభకోణాలు చేశారని ప్రచారం చేయించారన్నారు. దీనిపై డీబీఎఫ్ రాష్ట్ర కమిటీ హైకోర్టులో పూర్తి వివరాలతో పిటిషన్ వేసిందన్నారు. ఎస్సీ నియోజక వర్గంగా ఉన్న తాడికొండ రాజధాని ప్రాంతంలో ఉండటం ఇష్టం లేకనే వైఎస్ జగన్ రాజధానిని నాశనం చేశారని ఆయన విమర్శించారు. జగన్‌ది ప్రభుత్వం కాదు, వన్ మ్యాన్ బటన్ షో మాత్రమేనని, దళిత బహుజన ద్రోహి జగన్‌కు ఓట్లు అడిగే హక్కు లేదని ఆయన తెలిపారు.